SAMAYAM

epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 118 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 25 ఫిబ్రవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

# కల్తీ నెయ్యి మహాపాపం

**వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో 20 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో చేశారు: సీఎం చంద్రబాబు**

**తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో లఘు చర్చ**

**'మహాపాపం' పేరిట గత ప్రభుత్వం లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన సీఎం చంద్రబాబు**



**అమరావతి**

వైఎస్సార్సీపీ హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని సీఎం చంద్రబాబు తెలిపారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని అన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో సీఎం మాట్లాడుతూ 'మహాపాపం' పేరిట గత ప్రభుత్వం లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వైఎస్సార్సీపీ నేతలు ఒక లడ్డూ విషయంలోనే కాదు అనేక విషయాల్లో తప్పు చేశారని కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. 2019-24 మధ్యకాలంలో 20 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో చేశారని సీఎం అన్నారు. 59.71 లక్షల కేజీల కల్తీ నెయ్యి వినియోగించారని ఇంక రూ.234.51 కోట్ల నిధుల అక్రమాలు జరిగాయని వివరించారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ల్యాబ్‌లకు కన్నుకప్పి టెండర్లు దక్కించుకున్నారని వెల్లడించారు.

- మిగతా3లో



# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

**డీజీపీ ఎదుట లొంగిన ప్రధాన నేతలు**

**లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న**

- 40 ఏళ్ల అజ్ఞాతానికి మావోల వీడ్కోలు
- వారిపై ఉన్న రివార్డును అందిస్తామన్న డీజీపీ శివధర్ రెడ్డి
- కేవలం ఇక 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం)

మిగతా 2 లో



## ప్రజాజీవితంలోకి రావాలనే అజ్ఞాతం వీడాం

**ప్రజల సమస్యల కోసం ఇకముందూ పోరాడుతాం**

**లొంగిన మావోయిస్ట్‌లు దేవీజీ, రాజిరెడ్డి వెల్లడి**

2

## గణపతి ఆచూకీ కనుగొన్న పోలీసులు

నేపాల్‌లో ప్రవాసంలో ఉన్నట్లుగా గుర్తింపు

వివరాలు 2లో



## మీ అరచాకాలను సహించం

- మా నేతలను జైలులో పెడితే భయపడబోం
- నీకూ అదే గతి పట్టక తప్పదు రేవంత్
- బాల్క సుమన్‌ను జైలులో పరామర్శించిన కేటీఆర్

.. వివరాలు 3లో

## అంబర్‌పేటలో తీవ్ర విషాదం

**కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య**

- హోటల్ నడుపుతూ బతుకుతున్న కుటుంబం
- ఆర్థిక సమస్యలే కారణమంటూ సూసైడ్ నోట్


2



## జీహెచ్ఎంసీలోనూ పాగా వేస్తాం

**ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకు వెళతాం**

**కేంద్రమంత్రి బండి సంజయ్**



.. వివరాలు 3లో

## త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'




- ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి నడిపించాలన్నదే మా అజెండా
- తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ - ప్యూర్ - రేర్'
- 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. పెట్టుబడిదారులకు మరింత సౌలభ్యం కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కొత్త విధానాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు.

3



## 127 కోట్ల సైబర్ మోసం 104 మంది అరెస్ట్

**హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్ ఆక్టోపస్ సక్సెస్**

తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో భారీ ఆపరేషన్ నిర్వహించారు. 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి 104 మంది నిందితులను అరెస్టు చేసింది సైబర్ క్రైమ్ విభాగం.

వివరాలు 2లో

## కాళ్లు కట్టేసి.. కట్టెల పొయ్యిలో వేసి..

- పసికందును సజీవదహనం చేసిన తల్లి
- మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో దారుణం



## నేటినుంచి ఇంటర్ పరీక్షలు

**భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు**

2





# 127 కోట్ల సైబర్ మోసం 104 మంది అరెస్ట్

## హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్ ఆక్టోపస్ సక్సెస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 :**'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 16 రాష్ట్రాల్లోని 104 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. నిందితుల్లో బ్యాంకు అధికారులు కూడా ఉన్నారు. 32 బృందాలతో 16 రాష్ట్రాల్లో 10 రోజుల పాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. నిందితులపై దేశవ్యాప్తంగా 1,055 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు వీరు పలు సైబర్ నేరాల్లో రూ.127 కోట్లకు పైగా మోసాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. వారి నుంచి రూ.36 లక్షల నగదుతో పాటు 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్‌కార్డులు, 152 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 234 డెబిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

# కాళ్లు కట్టేసి.. కట్టెల పొయ్యిలో వేసి..

## పసికందును సజీవదహనం చేసిన తల్లి.. దుండిగల్‌లో దారుణం



**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. రెండు నెలల బాలుడిని కన్న తల్లి అత్యంత దారుణంగా హత్య చేసింది. బాలుడిని కట్టెల పొయ్యిలో వేసి కాల్చి చంపింది. ఏడవకుండా నోట్లో బట్టలు కుక్కి, కాళ్లు కట్టేసి మరి హత్య చేసింది. బౌరంపేట్ ప్రాంతంలో ఈ అమానుష ఘటన జరిగింది. ఈ ఘటనపై స్థానికుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బిహార్‌కు చెందిన కుటుంబం బౌరంపేట్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ సైట్ వద్ద పని చేస్తున్నట్లు సమాచారం.నవమోసాలు మోసిన బిడ్డను అతి దారుణంగా చంపడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు పసిబిడ్డను చంపడానికి ఆమెకు మనస్సు ఎలా వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తల్లి ఇలా ఎందుకు చేసిందో తెలియాల్సి ఉంది. అలానే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరించారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25, బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి ప్రథమ, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 1495పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఫస్టియర్‌లో 489126 మంది, సెకండియర్‌లో 507949 మంది కలిపి మొత్తం 997075 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్ష కేంద్రానికి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థుల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, గోడ గడియారాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళన, మానసిక ఆవేదన లాంటి సమస్యలను అధిగమించేందుకు 14416, 80693 91416 నెంబర్లను అందుబాటులోకి తెచ్చామని, విద్యార్థులు ఈ నెంబర్లకు ఫోన్ చేసి కౌన్సెలింగ్ సేవలు పొందవచ్చని కృష్ణ ఆదిత్య తెలిపారు.

# వైరాలో భారీగా గంజాయి పట్టివేత

## వాహనాల తనిఖీలో పట్టుబడ్డ వైనం

**ఖమ్మం, ఫిబ్రవరి 24:** ఖమ్మం జిల్లా వైరాలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా అవుతున్న 101.2 కిలోల ఎండు గంజాయితో పాటు 2.7 కిలోల హాషీష్ ఆయిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ అనుమానస్పదంగా ఉన్న హర్యానా నెంబర్ ప్లేట్ కలిగిన కారును ఆపి చెక్ చేసింది. తనిఖీల్లో గంజాయి, హ్యాషిష్ ఆయిల్ బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మహమ్మద్ అస్లాంను పోలీసులు అరెస్ట్ చేశారు. కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు నిందితుడిని అప్పగించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు 67.20 లక్షల రూపాయలుగా తెలుస్తోంది.




# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

మొదటి పేజీ తరువాయి

నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పని చేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984-89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి.. 1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010-16 మధ్య ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్‌ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999-2000లో ఏటూరునాగారం-మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహా రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

# గణపతి ఆచూకీ కనుగొన్న పోలీసులు

## నేపాల్‌లో ప్రవాసంలో ఉన్నట్లుగా గుర్తింపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 24 :** కొన్ని దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీని నడిపించిన అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు ఆచూకీ లభ్యమైంది. గత కొన్నేళ్లుగా భారత్ పొరుగునున్న నేపాల్‌లో ఆయన మకాం వేశారు. తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన నడవలేని పరిస్థితిలో ఉన్నారు. అయితే గణపతిని భారత్‌కు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వృద్ధాప్యం కారణంగా మావోయిస్టు పార్టీ కార్యదర్శి పదవిని గణపతి వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. మరో వైపు హైదరాబాద్‌లో పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట నలుగురు కీలక మావోయిస్టులు లొంగిపోనున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సెక్రటరీ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు, కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డితోపాటు నున్నె నరసింహారెడ్డిలు లొంగిపోనున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ అడవుల్లో ఎస్ఐబీ ఎదుట దేవ్ జీతోపాటు మల్లా రాజిరెడ్డి లొంగిపోయిన సంగతి తెలిసిందే. అదీకాక దేవ్ జీతోపాటు పలువురు అగ్రనేతలు మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలకు చేరుకున్నారంటూ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కర్రెగుట్టల ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మరణించిన విషయం విదితమే. 2026, మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకొంది. ఆ దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. దీంతో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిరంతరం కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. వేలాది మంది ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. పలువురు అరెస్టయ్యారు. భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో పలువురు అగ్రనేతలు సైతం మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు పోలీసులకు చిక్కితే.. మావోయిస్టు పార్టీ చరిత్రగా మిగిలిపోయే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.

# ప్రజాజీవితంలోకి రావాలనే అజ్ఞాతం వీడాం

## ఇకప్రజల సమస్యల కోసం పోరాడుతాం

## లొంగిన మావోయిస్టులు దేవీజీ, రాజిరెడ్డి వెల్లడి



**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** మావోయిస్ట్ పార్టీకి చెందిన అగ్రనేతలు డిజిపి ఎదుట లొంగిపోయారు. అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఈ సందర్భంగా దేవ్‌జీ మీడియాతో మాట్లాడుతూ.. 'అనారోగ్య కారణాల రీత్యా నేను లొంగిపోయాను. రహస్య జీవితం నుంచి బహిరంగ జీవితం గడపాలని భావిస్తున్నాను. దశాబ్దాల కాలం నుంచి నేను నమ్మిన సిద్ధాంతాల ప్రకారమే ప్రజల కోసం పనిచేస్తాను. ప్రజల సమస్యలపై ప్రజల్లో ఉండి పోరాటం చేస్తాను. త్వరలో రాజకీయ ప్రవేశం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భావిస్తున్నాను. మీరు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పే పరిస్థితిలో లేను. నేను ఏది మాట్లాడినా అపార్థాలకు దారితీసే విధంగా ఉంటుంది. నేను రాజకీయ జీవితం కొనసాగించాలని కోరుకుంటున్నాను. మీరడిగే ప్రశ్నలకు నేను చెప్పే జవాబు.. రాజకీయ జీవితానికి ఇబ్బంది కలిగించవద్దని అన్ని విషయాలు పంచుకోవడం లేదు' అని అన్నారు. మల్లా రాజిరెడ్డి మాట్లాడుతూ.. 'ప్రజలతో కలిసి పనిచేయాలని భావిస్తున్నాం. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాం. చట్ట ప్రకారమే పోరాటం చేయాలని లొంగిపోయాం. మావోయిజం అనేది ఎప్పటికీ అంతం కాదు. కొన్ని ప్రశ్నలను ప్రభుత్వంతో చర్చిస్తాం. త్వరలో అన్ని ప్రశ్నలకు జవాబు చెప్తాం' అని అన్నారు.

# అంబర్‌పేటలో తీవ్ర విషాదం

## కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

## ఆర్థిక సమస్యలే కారణమంటూ సూసైడ్ నోట్




**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటలో విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతులను భర్త రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), కుమారుడు శశాంక్ (24)గా గుర్తించారు. తొలుత మాధవిని రామరాజు, శశాంక్ ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం వారిద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హోటల్ వ్యాపారంలో నష్టం, అప్పుల వారి వేధింపులతో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరు ఎన్నో ఏళ్లుగా హోటల్ బిజినెస్ చేస్తున్నారు. కానీ ఏం కష్టం వచ్చిందో తెలియదు? అర్ధాంతరంగా ఈ కుటుంబం తనువు చాలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. తమ మృతికి ఆర్థిక భారం కారణం అంటూ సూసైడ్ నోట్ రాశారు. నిజంగానే వ్యాపారంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా? లేక పరువు పోతుందేమోనన్న భయంతో ముగ్గురు సూసైడ్‌కు పాల్పడ్డారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అంబర్ పేట్ లోని బాపూజీ నగర్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ల్యాండ్ మార్క్ హోటల్ యజమాని కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య పాల్పడ్డారు. మృతులను రామ్‌రాజ్, మాధవి, శశాంక్‌గా గుర్తించారు. హైదరాబాద్ అంబర్ పేట్‌లో ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని రామ్‌రాజ్ ఫ్యామిలీ సూసైడ్ చేసుకున్న వార్త స్థానికంగా కలకలం సృష్టించింది. రామ్ రాజ్ ఫ్యామిలీ ఎన్నో ఏళ్లుగా అంబర్‌పేట్‌లోనే నివాసం ఉంటున్నారు. సొంతిల్లు.. పెద్ద భవనం.. కోట్లలో ఆస్తులు ఉన్నాయి. కానీ ముగ్గురు సూసైడ్ చేసుకోవడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.. రామ్ రాజ్ ముందు భార్య మాధవిని చంపి, అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. మరోవైపు రామ్‌రాజ్ కుమారుడు శశాంక్ తన ఎడమ చేయి కోసుకుని సూసైడ్ చేసుకున్నాడు. కానీ అతను చనిపోకపోవడంతో ఇంట్లోనే ఉరేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చనిపోతున్నట్టు రామ్‌రాజ్ సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. తన ఆస్తులు మొత్తం తన కూతురికేనంటూ వీలునామా కూడా రాసినట్లు సమాచారం. ప్రస్తుతం రామ్‌రాజ్ కూతురు అమూల్య కొంపల్లిలో ఉంటున్నట్లు తెలుస్తోంది. సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ చేస్తున్నారు పోలీసులు. రామ్‌రాజ్ కూతురు ఏదైనా కోణంలో అనుమానం వ్యక్తం చేస్తే.. ఆ దిశగా కూడా విచారణ చేస్తామని చెప్పారు పోలీసులు. ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని కుటుంబం మృతిపై రామ్‌రాజ్ అన్న జగదీశ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఆర్థిక ఇబ్బందులు పెద్ద సమస్య కాదని, తమది వెల్ సెటిల్డ్ కుటుంబం అని చెప్పారు. తమకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేవంటున్నారు జగదీష్. నా తమ్ముడు ఫ్యామిలీ సూసైడ్ ఎందుకు చేసుకున్నారో.. అసలు ఏం జరిగిందో తెలియడం లేదని కంటతడి పెట్టారు. మరోవైపు తెల్లవారు 3 గంటల 15 నిమిషాలకు రవి అనే మిత్రుడికి రామ్ రాజ్ వాట్సాప్‌లో సూసైడ్ చేసుకున్నామని మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తన మిత్రుడు రామ్ రాజ్ ఇంటికి వచ్చి చూసేసరికి భార్యభర్తలు ఇద్దరు ఉరేసుకుని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు రవి. రామ్ రాజ్.. అంబర్‌పేట్‌లో ల్యాండ్ మార్క్ హోటల్, మల్లేపల్లిలో బిరియాని సెంటర్, మల్లాపూర్‌లో కింగ్స్ హోటల్, చక్రిపురంలో మరొక హోటల్ నిర్వహిస్తున్నారు. ఐతే ఎవరైనా అప్పులు ఇచ్చిన వారు భయపెడితే చనిపోయారా? ఎవరైనా భయపెట్టారా? ఇలా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు పోలీసులు.

# మీ అరచాకాలను ఇక సహించేది లేదు

- మా నేతలను జైలులో పెడితే భయపడబోం
- నీకూ అదే గతి పట్టక తప్పదు రేవంత్
- బాల్క సుమన్‌ను పరామర్శించిన కేటీఆర్



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 24:** ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలుకుపోలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆరు నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలో జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని హెచ్చరించారు. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 22 చోట్లకుగానూ 14 స్థానాల్లో గెలుపుతో స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాల్లో మాత్రమే గెలిచినా అధికార దాహంతో ప్రజాతీర్పును అపహాస్యం చేసింది. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు వారికి తొత్తులుగా మారి ప్రజాతీర్పును ఎగతాళి చేశారు' అని మండిపడ్డారు. 'మరికొన్ని మున్సిపాలిటీల లోనూ ఇదే రీతిన వ్యవహరించారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం లేదు. బాల్క సుమన్‌ను ఇక్కడ జైలులో ఉంచి వారి డ్యూటీకి ఆటంకం కలిగించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను తిట్టినా కేసులు పెట్టలేదు. అధికార పార్టీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తుంటే.. ప్రశ్నించిన మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. మూడు కోట్ల ఆఫర్ ఇచ్చినా మా కౌన్సిలర్లు లొంగలేదు. సీపీఐ కౌన్సిలర్లు సైతం నిబద్ధతతో ఉన్నారు. పొత్తుధర్మాన్ని పాటిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. 'రేవంత్ రెడ్డికి మళ్ళీ చిప్పకూడు తినే సమయం వస్తుంది. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ బీఆర్ఎస్ నేతలపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తిరిగి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురుతుంది. ఏ కలుగులో దాక్కున్నా అరాచకాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిని వదలం. క్యాతన్ పల్లి, ఇబ్రహీం పట్నం, ఖానాపూర్‌లో వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై సైతం కేసు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్నది. అధికార పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పే రోజు వస్తుంది. బాల్క సుమన్‌ను దగ్గరలో ఉన్న జైలులో పెట్టకుండా దూరంగా ఉన్న జైలులో పెట్టి.. దోమలు ఎక్కువగా ఉన్న గదిలో ఉంచి వేధిస్తున్నారు. వీటన్నింటిని గుర్తుపెట్టుకుంటాం' అని వార్నింగ్ ఇచ్చారు.



# రెండేళ్లుగా దేవాదుల నుంచి ఒక్క ఎకరా పారలే

- సాగునీరు అందించిన పాపాన పోలేదు
- నత్తనడకన వరంగల్ సూపర స్పెషాలిటీ నిర్మాణం
- అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా చర్చించడానికి సిద్ధం
- వరంగల్ ఆస్పత్రి నిర్మాణాలను పరిశీలించిన హరీష్ రావు

**వరంగల్, ఫిబ్రవరి 24:** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో దేవాదుల నుంచి ఒక్క ఎకరా భూమినీ సేకరించలేదని, సాగునీరూ అందించలేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మంత్రుల మాటలకు, సీఎం మాటలకు పొంతన లేదన్నారు. ఈ ప్రభుత్వానికి డేట్‌లు, డెడ్‌లైన్‌లు మాత్రమే మారుతున్నాయని హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి విరుచుకుపడ్డారు. మంగళవారం వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మాజీ మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్‌ను తాము సందర్శించిన వెంటనే సీఎం రివ్యూ చేశారని.. తాము తట్టిలేపితేనే సీఎం నిద్ర లేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్ట్ మొదటి ప్రాధాన్యమని చెబుతూనే పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి నీళ్లను పొలాలకు మళ్లించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. కాంగ్రెస్ ఏమీ చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. అసెంబ్లీలో కెమెరా తిప్పకుండా, మైక్ కట్ చేయకుండా చర్చించే దమ్ము సీఎంకు ఉందా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. దేవాదుల ప్రాజెక్ట్‌లో 90 శాతం పనులు పూర్తయ్యాయని, 10 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని.. త్వరలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల కోసం కేసీఆర్ హెల్త్ సిటీ నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం రేవంత్ రెడ్డిదని.. పేదల కోసం పనిచేసే ఆలోచన కేసీఆర్‌ది అని ఆరోపించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై నిర్లక్ష్యం చేయవద్దని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందని పనులు చేయట్లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా ఆసుపత్రి ప్రారంభం కావట్లేదని విమర్శించారు. రెండేళ్లు ఓపిక పట్టామని.. ఇక నిలదీస్తామని, గల్లా పట్టి అడుగుతామని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ నిరసన దీక్షలకు దిగుతుందని వార్నింగ్ ఇచ్చారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఏడాదిన్నరగా గుండె శస్త్ర చికిత్సలు ఆగిపోయాయని తెలిపారు. ఎంజీఎంలో 3 ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్లు పెట్టామని, ఇప్పుడు ఒక్కటి కూడా పనిచేయట్లేదని ఆయన విమర్శలు గుప్పించారు.



# జీహెచ్ఎంసీలోనూ పాగా వేస్తాం

- ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకు వెళతాం
- కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళతామని అన్నారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతోనే కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకునేందుకే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి ఆలయం ఎంతో పవర్‌ఫుల్ అని, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో ఈ ఆలయాన్నీ గో÷–డలెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. పాతబస్తీ హిందువులకు భాగ్యలక్ష్మి అమ్మవారు రక్షణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ప్రజా సంగ్రామ యాత్రను భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రారంభించామని, కేసీఆర్ ప్రభుత్వ అడ్డంకులను ఎదుర్కొని 1640 కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లో హిందూ సమాజానికి ఏ ఆపద వచ్చినా అడ్డుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేసిన బండి సంజయ్.. ఆలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం, బంజారాహిల్స్ పెద్దమ్మ ఆలయం, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయన్నారు. బాన్సువాడలో హిందువులపై రాళ్లదాడి జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని, అమాయకులను అరెస్ట్ చేయడం సరికాదని కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలీసులు అక్రమ అరెస్టులను ఆపాలని హెచ్చరించారు. అవసరమైతే తానే బాన్సువాడకు వెళ్లి హిందువులకు రక్షణగా నిలుస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగులకు బకాయిలు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

- ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి నడిపించాలన్నదే మా అజెండా
- తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ - ప్యూర్ - రేర్'
- 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో.. త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేలా, పెట్టుబడిదారులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావి తరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ విజన్ 2047' ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'క్యూర్ – ప్యూర్ – రేర్' అనే త్రిముఖ వ్యూహానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామ న్నారు. నగరం నుంచి గ్రామం వరకు ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. ఏఐ, ఇండస్ట్రీ 5.0 లాంటి టెక్నాలజీస్ తో వర్క్ కల్చర్ లో మార్పు వచ్చిందని, రాబోయే రోజుల్లో కంపెనీల కంటే 'ఎకో సిస్టం'కే ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానినే నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే వ్యవస్థలా కాకుండా, వారితో కలిసి నడిచే భాగస్వామిగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యులు డా.నాగేశ్వర్ రెడ్డి, ఫ్యాప్సీ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, స్కై రూట్ ఏరో స్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026 కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు.






# 'మీ సేవ' మొబైల్ ఆప్ ప్రారంభం

బస్ టిక్కెట్ పొందే సౌకర్యం.. ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌలభ్యం కోసం మీసేవ మీ టికెట్ మొబైల్' యాప్ ద్వారా సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్, తెలంగాణ ఆర్టీసీ వీసీ / ఎండీ వై.నాగిరెడ్డి, మీసేవ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి మీ మొబైల్ ఆప్ ను ఆవిష్కరించారు. ఈ సరికొత్త విధానం ద్వారా మీ టికెట్ మొబైల్ యాప్ క్షఖఖా సేవలను కూడా అనుసంధానిస్తుంది. ప్రయాణీకులు సుదూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్సు టిక్కెట్లను డిజిటల్‌గా బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ఐదు రకాల బస్ పాస్‌లు పొందే సౌకర్యం కలుగనుంది. మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఇప్పుడు ఐదు కేటగిరీల సిటీ బస్ పాస్‌లు డిజిటల్‌గా అందుబాటులో ఉన్నాయి. బస్ పాస్ మాడ్యూల్ హైదరాబాద్ నగరంలోని ప్రయాణీకులకు మొబైల్ యాప్ ద్వారా నెలవారీ బస్ పాస్‌లను డిజిటల్‌గా తీసుకోవడానికి మరియు పునరుద్ధరించడానికి వీలు కల్పిస్తుంది.అందుబాటులో గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో కార్యకలాపాల కోసం టి 24 టికెట్‌ను మొబైల్ యాప్‌లో విలీనం చెయ్యడం జరిగింది. టి 24 టికెట్ అనేది 24 గంటల డిజిటల్ ట్రావెల్ పాస్, ఇది యాక్టివేషన్ సమయం నుండి సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ మరియు మెట్రో డీలక్స్ బస్సు సర్వీసులలో అపరిమిత ప్రయాణాన్ని అనుమతిస్తుంది.టి–24 టికెట్ పర్యాటకులకు, అప్పుడప్పుడు ప్రయాణించేవారికి మరియు ఒకే రోజులో బహుళ ట్రిప్పులు అవసరమయ్యే ప్రయాణీకులకు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో టిజీఎస్ ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్ , వెంకన్న, ఖుస్రో షా ఖాన్ ,రాజశేఖర్ , ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప , సిటీఎం శ్రీదేవి సిఈ(ఐటి) శ్ శ్రీదేవి,హైదరాబాద్ , రంగారెడ్డి ఆర్ఎం లు సుధాపరిమళ , శ్రీలత పలువురు అధికారులు పాల్గొన్నారు





## సంపాదకీయం

# ప్రజల పాలిట 'పాల'కూట విషం

**కల్తీకి కాదేదీ అనర్హం అన్నట్లుగా తయారైంది నేటి పరిస్థితి. కల్లు, మద్యం, నూనెలు.. ఇలా అన్నీ విషతుల్యం అవుతున్న తరుణంలో, చివరకు అమృతంతో సమానమైన పాలు కూడా కల్తీ మాఫియా చేతుల్లో ప్రాణాంతకంగా మారుతున్నాయి. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఐదుగురు మరణించిన ఘటన సభ్య సమాజాన్ని నివ్వెరపరిచింది. ఇది కేవలం ఒక ప్రాంతానికో, ఒక డెయిరీకో పరిమితమైన సమస్య కాదు.. వ్యవస్థాగతంగా పేరుకుపోయిన నిర్లక్ష్యానికి పరాకాష్ట.**

పాలు.. స్వచ్ఛతకు ప్రతీక. పసికందు నుంచి వృద్ధుల వరకు ప్రతిరోజూ తాగే ఆహారం. ఆరోగ్యానికి మూలాధారం. కానీ అదే పాలు కల్తీ రూపంలో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారితే? రాజమహేంద్రవరంలో జరిగిన విషాదం ఈ ప్రశ్నను తీవ్రంగా ముందుకు తెచ్చింది. ఇటీవల కల్తీ పాలు తాగి ఐదుగురు మృతి చెందడం, మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందడం రాష్ట్రాన్ని కుదిపేసింది. అనూరియా (మూత్ర విసర్జన ఆగిపోవడం), కిడ్నీ సమస్యలు, డయాలసిస్ అవసరం వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకోవడం ఆందోళనకరం. ఒకే డెయిరీ నుంచి పాలు కొనుగోలు చేసిన వారిలో ఈ సమస్యలు ఉత్పన్నమవడం కల్తీ దందాకు నిదర్శనం. ఈ రోజుల్లో కల్తీ కేవలం పాలకే పరిమితం కాదు. మద్యం, కల్లు, ఆహార పదార్థాలు అన్నీ కల్తీ బారిన పడుతున్నాయి. అయినా కఠిన చర్యలు కనిపించడం లేదు. అడపాదడపా దాడులు జరుగుతున్నా, కల్తీ వ్యాపారుల్లో భయం లేదు.

**ఒకప్పుడు పాలలో నీళ్లు కలపడం పెద్ద నేరంగా పరిగణించేవారు. ఇప్పుడు యూరియా, ఫార్మలిన్, సోడా, బియ్యం పిండి, గ్లూకోజ్, జంతువుల కొవ్వు వంటి ప్రమాదకర రసాయనాలతో సింథటిక్ పాలను తయారు చేసి మార్కెట్‌లోకి దింపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్సిటోసిన్ వంటి నిషేధిత ఇంజెక్షన్లను పాల దిగుబడి పెంపునకు రహస్యంగా వాడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.**

గతంలో సహకార డెయిరీలు బలంగా ఉన్నప్పుడు పాల నాణ్యతపై ఒక నియంత్రణ ఉండేది. రైతులు స్వయంగా నిర్వహించే వ్యవస్థలో పారదర్శకత ఉండేది. కానీ సహకార రంగం క్రమంగా బలహీనపడడంతో ప్రైవేట్ డెయిరీలు పుట్టగొడుగుల్లా పెరిగాయి. ఇప్పుడు డెయిరీ ప్రైవేటీకరణ కాస్తా కార్పొరేటీకరణ దిశగా సాగుతోంది. రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. కానీ సేకరించిన పాలను ప్రాసెస్ చేసి అమ్మే సంస్థలకు మాత్రం లాభాల పంట పండుతోంది. ఉత్పత్తి--వినియోగం మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో కొందరు కల్తీకి పాల్పడుతున్నారన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఫుడ్ సేఫ్టీ వ్యవస్థ బలహీనంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాలం చెల్లిన, నాసిరకం, కల్తీ పాలను గుర్తించే సమర్థవంతమైన వ్యవస్థ ఉందా అన్న సందేహం వ్యక్తమవుతోంది. తనిఖీ బాధ్యతను ఆయా సంస్థలకే వదిలేసినట్లుగా పరిస్థితి కనిపిస్తోంది. పాల సరఫరా చేసే ప్రతి యూనిట్‌ను నమోదు చేసి, పాడి పశువుల సంఖ్య, ఉత్పత్తి వివరాలు ప్రభుత్వ వద్ద రికార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలి. అనుమతి లేని కేంద్రాలను మూసివేయాలి. నాణ్యత తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహించాలి.

యూరియా వంటి రసాయనాలు మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఫార్మలిన్ జీర్ణకోశ వ్యవస్థను దెబ్బతీస్తుంది. ఇతర రసాయనాలు కాలేయం, ఉదర సంబంధిత వ్యాధులకు దారితీస్తాయి. చిన్నారులు, వృద్ధులు అత్యధికంగా ప్రభావితమవుతున్నారు. రాజమహేంద్రవరం ఘటనలో మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం, చికిత్స ఖర్చులను భరించడమే సరిపోదు. మూల సమస్యను నిర్మూలించాల్సిన అవసరం ఉంది. కల్తీ పాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి. పటిష్ఠమైన తనిఖీ వ్యవస్థ, వేగవంతమైన న్యాయ చర్యలు, ప్రజల్లో అవగాహన- ఈ మూడు లేకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతూనే ఉంటాయి. పాలు ప్రజల ఆరోగ్యానికి మూలాధారం. అదే పాలకూట విషంగా మారితే సమాజం మొత్తం ప్రమాదంలో పడుతుంది. కాసుల కక్కుర్తితో ప్రజల ప్రాణాలతో ఆటలాడే దందాకు తక్షణమే అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. రాజమహేంద్రవరం ఘటన ఒక హెచ్చరిక. ఇప్పటికైనా మేల్కొని చర్యలు తీసుకుంటేనే ప్రజల ఆరోగ్యాన్ని కాపాడగలం.



# ఎంతకాలం ఉంటానో తెలియదు..

- అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు
- నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య



**వాషింగ్టన్, ఫిబ్రవరి 24:** నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్-ఎ-లాగో రిసార్ట్ లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా ?' అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్-ఎ-లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్ స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్ట్స్ మెసేజ్‌ల ద్వారా వెల్లడయ్యింది. తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

# ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలు

- యూత్ కాంగ్రెస్ చిల్లర చేష్టలపై విమర్శలు
- యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు చిబ్ అరెస్ట్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన 'షర్ట్‌లెస్' నిరసనకు సంబంధించి.. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసన గురువారం సమ్మిట్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఐదుగురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షర్టులు విప్పేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా సందేశాలు రాసిన టీ-షర్టులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు గుప్పించారు. సెక్యూరిటీ సిబ్బంది.. వారిని వెంటనే బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన తర్వాత ఏడుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఢిల్లీ పోలీసులు ఉదయ్ భానును అరెస్టు చేశారు. ఆయన్ను తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారించిన తర్వాత అరెస్ట్ చేశారని సమాచారం. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్ట్‌ల సంఖ్య ఎనిమిదికి చేరింది. పోలీసులు ఆయనపై.. కుట్రలో పాత్ర ఉందని, విచారణకు సహకరించలేదని, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. భూపేశ్ బాఘేల్ వంటి సీనియర్ నేతలు ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు వేయడం, నిరసన తెలపడం నేరం కాదు, అది ప్రజాస్వామ్య ఆయుధం' అని బాఘేల్ అన్నారు. ఈ అరెస్ట్‌లను అరాచక, అన్యాయ చర్యలుగా పేర్కొన్నారు. నిరసన శాంతియుతం గా జరిగిందని, యువత బాధలను బయటపెట్టడమే ఉద్దేశ్యమని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. బీజేపీ నేత ప్రదీప్ భండారి ఈ నిరసనను 'నేక్డ్ యాంటీ-ఇండియా ప్రొటెస్ట్' అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను యాంటీ-ఇండియా, యాంటీ-గ్రోత్ పార్టీగా విమర్శించారు. 'యువతకు కాంగ్రెస్ 'నంగి' పార్టీగా కనిపిస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో జరుగుతున్న చర్చలు, ప్రదర్శనలకు సంబంధించింది. దీనిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈవెంట్‌గా చూస్తున్నారు. అయితే.. ఈ నిరసన వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని, దేశం పరువు మంటగలపాలన్నది వీరి పన్నాగమని బీజేపీ వర్గాలు మండిపడు తున్నాయి.

# కేరళ.. ఇక కేరళం

## కేంద్ర కేబినేట్ తీర్మానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర క్యాబినెట్ నేడు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలిచేలా సంబంధిత బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మలయాళీ రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. తమ రాష్ట్రం పేరును మార్చాలనే ప్రతిపాదనలు మలయాళీ ప్రజల నుంచి ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. కేరళను మలయాళంలో 'కేరళం' అని పిలుస్తారని.. ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ 2023లో ప్రవేశపెట్టిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అయితే.. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు కొన్ని మార్పుల అనంతరం కేరళ అసెంబ్లీ మరోసారి ఆ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తర్వాత ఇది ఇన్నాళ్లూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఎట్టకేలకు మంగళవారం గ్రీన్ సిగ్నల్ లభించింది. ఢిల్లీలో ఇటీవల ప్రారంభమైన నూతన 'సేవా తీర్థం' భవనంలో జరిగిన మొదటి క్యాబినెట్ సమావేశం ఇది. మొదటి తీర్మానాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమీక్షించిన అనంతరం.. కొన్ని సాంకేతిక మార్పులతో కేరళ అసెంబ్లీ రెండోసారి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్.. రాజ్యాంగంలోని మూడో అధికరణ ప్రకారం.. ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చిన అన్ని భాషలలో 'కేరళం'గా సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్న సందర్భంలో ఆయన మాట్లాడుతూ.. మలయాళంలో రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, జాతీయ స్వాతంత్ర్య పోరాట సమయం నుంచి మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ఉద్భవించిందని అన్నారు.

# భారత్‌ను అమ్మేశారు

## అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోడీ

## మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్



**భోపాల్, ఫిబ్రవరి 24:** భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్ధాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

# పట్టణ ఆవాస్ యోజన కింద కొత్తగా 2.88లక్షల ఇళ్లు మంజూరు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన- అర్బన్2.0 (పీఎంఏవై-యూ:2.0) కింద కొత్తగా 2.88లక్షల ఇళ్లను కేంద్రం మంజూరు చేసింది. కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తాజాగా మంజూరు చేసినవాటితో కలిపి పీఎంఏవై-యూ:2.0 కింద మంజూరు చేసిన మొత్తం ఇళ్ల సంఖ్య 13.61లక్షలకు పెరిగింది. కేంద్రం తాజా నిర్ణయంతో 16 రాష్ట్రాలు లబ్ధి పొందనున్నాయి. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఉన్నాయి.

# దేశమంతటా ఒకే ఒక స్వచ్ఛమైన ఓటర్ల జాబితా

## ఎలక్షన్ కమిషన్ సమావేశంలో డిక్లరేషన్


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** దేశమంతటా ఒకే ఒక స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పాటించాలని కేంద్ర, రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు నిర్ణయించారు. మంగళవారం ఇక్కడ జరిగిన భారత ఎన్నికల కమిషన్, రాష్ట్రాల ఎన్నికల కమిషనర్ల రౌండ్ టేబుల్ సదస్సులో ఈ మేరకు జాతీయ డిక్లరేషన్-2026ను ఏకగ్రీవంగా ఆమోదించారు. 27 సంవత్సరాల అనంతరం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో ఇలాంటి రౌండ్ టేబుల్ సదస్సు జరగడం గమనార్హం. స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించడం ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన, జాతీయ ప్రాధాన్యత గల విషయమని ఈ సదస్సు పేర్కొంది. పంచాయతీలు, మునిసిపల్ ఎన్నికల చట్టాలను పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల చట్టాలకు అనుగుణంగా రూపొందించాలని తెలిపింది. పారదర్శకంగా, సమర్థంగా, న్యాయపరంగా బలంగా ఉండే ఎన్నికల ప్రక్రియలు అమలు అయ్యేలా చూస్తామని ప్రధాన ఎన్నికల కమిషన్ జ్ఞానేష్ కుమార్ తెలిపారు.

# రాజకీయాలకు అతీతంగా లోకేశ్



**విజయవాడ :** ప్రస్తుత రాజకీయాల్లో పార్టీల మధ్య వైరం, విమర్శలు సర్వసాధారణం. కానీ, ప్రజాప్రతినిధి అంటే కేవలం తన పార్టీ వారికి మాత్రమే కాదని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలిచేవాడే నిజమైన నాయకుడని మంత్రి నారా లోకేష్ మరోసారి నిరూపించారు. రాజకీయ రంగులు చూడకుండా, మానవత్వమే పరమావధిగా ఆయన స్పందించిన తీరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీరాభిమాని, సోషల్ మీడియాలో ఆ పార్టీ తరపున చురుగ్గా ఉండే భాస్కర్ అనే యువకుడి తండ్రి ఇటీవల ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన తండ్రిని కాపాడుకోవడానికి భాస్కర్ తన వద్ద ఉన్న శక్తినంతా ధారపోశాడు. అయితే, వైద్య ఖర్చులు భారమవ్వడంతో ఆందోళన చెందిన అతను, నిస్సహాయ స్థితిలో తన పార్టీ అధినేత వైఎస్ జగన్‌తో పాటు మంత్రి నారా లోకేష్‌ను కూడా ట్యాగ్ చేస్తూ ఎక్స్ వేదికగా సాయం కోరాడు. భాస్కర్ ట్వీట్ చూసిన వెంటనే మంత్రి లోకేష్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించారు. అతను తనను గతంలో ఎంతగా విమర్శించాడు లేదా ఏ పార్టీకి చెందినవాడు అనే విషయాలను పక్కన పెట్టి, ఒక సాటి మనిషి ప్రాణం కాపాడటమే ముఖ్యం అని భావించారు. "మీ నాన్నగారికి జరిగిన ప్రమాదం గురించి విని బాధపడ్డాను భాస్కర్. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మా టీమ్ మిమ్మల్ని సంప్రదించి అవసరమైన సహాయం అందిస్తుంది" అంటూ భరోసా ఇచ్చారు. చెప్పినట్లుగానే లోకేష్ తన వ్యక్తిగత బృందాన్ని రంగంలోకి దింపారు. వెంటనే బాధితుడి కుటుంబాన్ని సంప్రదించి, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఒక వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు, టీడీపీ ప్రధాన కార్యదర్శి, మంత్రి స్థాయి వ్యక్తి స్వయంగా ఫోన్ చేయించి సాయం చేయడం రాజకీయ వర్గాల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ ఘటన నారా లోకేష్‌లోని పరిణతి చెందిన నాయకత్వ లక్షణాలను తెలియజేస్తోంది. ఎన్నికల సమయంలో విమర్శలు ఉండవచ్చు, కానీ కష్టం వచ్చినప్పుడు మాత్రం అందరూ ఒక్కటే అనే సంకేతాన్ని ఆయన ఇచ్చారు. ప్రభుత్వం అనేది అందరిది అని, ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉండటమే తమ ప్రాధాన్యత అని ఆయన నిరూపించారు. సోషల్ మీడియాలో దూషణలు చేసుకునే కార్యకర్తలకు, నాయకులు ఒకరికొకరు ఎలా గౌరవించుకుంటారో, ఎలా సాయం చేసుకుంటారో ఈ ఘటన ఒక కనువిప్పులా నిలిచింది. లోకేష్ చేసిన సహాయానికి భాస్కర్ చలించిపోయాడు. "థ్యాంక్యూ నారా లోకేష్ అన్నగారు.. పార్టీ చూడకుండా మా నాన్న గారి పరిస్థితిని చూసి ఒక అన్నలా సహాయం చేయడానికి ముందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు" అంటూ తిరిగి ట్వీట్ చేశాడు. ఆపద సమయంలో పార్టీ జెండాలు కాదు, మనిషికి మనిషి తోడవ్వడమే ముఖ్యమని అతను కూడా గ్రహించాడు. నారా లోకేష్ చేసిన ఈ చిన్న సాయం ఒక కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి కానీ ఇలాంటి మానవీయ విలువలే నాయకుడిని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలబెడతాయి. రాజకీయాల కంటే మానవత్వం గొప్పదని చాటిచెప్పిన లోకేష్ స్పందన నిజంగా అభినందనీయం. ఈ తరహా రాజకీయ సంస్కృతి రాష్ట్రంలో ఆరోగ్యకరమైన వాతావరణానికి నాంది పలుకుతుందని ఆశించవచ్చు=

# ఆ నాలుగు సీట్ల కోసం 40 మంది పోటీ



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి రాజ్యసభ వైపు మళ్లింది. వచ్చే జూన్ నెలలో ఖాళీ కాబోతున్న నాలుగు స్థానాలు అటు ఢిల్లీలోనూ, ఇటు అమరావతిలోనూ వేడి పుట్టిస్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీలో కూటమికి ఉన్న తిరుగులేని బలంతో ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కావడం ఖాయం. అయితే, ఆ సీట్లు ఎవరికి దక్కుతాయి? అధినేతల మనసులో ఉన్న ఆ అదృష్టవంతులు ఎవరు? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నకూటమిలోని మూడు పార్టీల మధ్య ఇప్పటికే ఒక అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. మొత్తం 4 స్థానాల్లో టీడీపీ 2, జనసేన 1, బీజేపీ 1 చొప్పున పంచుకోబోతున్నాయి. వైఎస్సార్సీపీకి చెందిన అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీ సీట్లు ఖాళీ అవుతుండడంతో ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కసరత్తు వేగవంతమైంది. టీడీపీకి దక్కే రెండు స్థానాల్లో ఒకటి ప్రస్తుత సభ్యుడు సానా సతీష్ కు దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. ఇక మిగిలిన ఒక్క సీటు కోసం అమరావతిలో భారీ ఎత్తున లాబీయింగ్ జరుగుతోంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే వర్ల రామయ్య ఈ రేసులో ముందున్నారు. పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న టీడీ జనార్ధన్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వీళ్లు కాకుండా పలువురు యువకులు కూడా రాజ్యసభ సీటు ఆశిస్తున్నారు. 2024 ఎన్నికల్లో సోషల్ మీడియా బాధ్యతలు చూసి, పార్టీ గెలుపుకు దోహదపడిన చింతకాయల విజయ్ కూడా సీటు ఆశిస్తున్నారు. ఇక లోకేశ్ స్నేహితుడు కిలారి రాజేష్ పేరు కూడా వినిపిస్తోంది. మరోవైపు పార్టీ అంతర్గత వ్యవహారాల్లో కీలకంగా ఉండే సురేశ్ కోనేరు పేరు కూడా అమరావతిలో వినిపిస్తోంది. అంతేకాక భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ కూడా సీటు ఆశిస్తున్నారు. ఇక జనసేన కోటాలో ఒక సీటు ఉండటంతో ఆశావహుల జాబితా చాంతడంత ఉంది. ఇటు పవన్, అటు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ పేరు దాదాపు ఖాయమైందనే ప్రచారం చాలారోజులుగా వినిపిస్తోంది. అయితే ఇప్పుడు పవన్ కల్యాణ్ ఆలోచన మారినట్లు సమాచారం. సినిమా ఇండస్ట్రీ నుంచి ఓ ప్రముఖుడిని రాజ్యసభకు పంపించే ఆలోచనలో పవన్ కల్యాణ్ ఉన్నట్టు సమాచారం. ఒకవేళ అది జరగకపోతే? పార్టీ గళాన్ని వినిపిస్తున్న వేములపాటి అజయ్ కుమార్ లేదా పార్టీ కోసం త్యాగాలు చేసిన ఇతర సీనియర్ నేతల పేర్లు కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఇక బీజేపీ తన సీటును సామాజిక సమీకరణాలకు వేదికగా మార్చుకోబోతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో అండగా నిలిచిన మందకృష్ణ మాదిగ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే అగ్రనాయకత్వం ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. మందకృష్ణకు టీడీపీ, జనసేన కూడా సంపూర్ణ మద్దతు తెలిపినట్లు సమాచారం. జూన్‌లో పదవీకాలం ముగుస్తున్నప్పటికీ, ముందస్తుగానే అభ్యర్థులను ఖరారు చేసి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని కూటమి భావిస్తోంది. ఫిబ్రవరి ఆఖరులో లేదా మార్చి మొదటి వారంలో ఈ పేర్లపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి ఈ నాలుగు సీట్ల కేటాయింపు కూటమిలోని అంతర్గత సమీకరణాలను, భవిష్యత్తు రాజకీయాలను ప్రతిబింబించబోతోంది.

# బుట్టా ఫ్యామిలీ దివాలా..!



**కర్నూలు :** ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ, వ్యాపార రంగంలోనూ అత్యంత సంపన్నురాలుగా పేరుగాంచిన మాజీ ఎంపీ బుట్టా రేణుక ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. ఆమె దంపతులు తీసుకున్న వందల కోట్ల రుణాలు బకాయిలుగా మారడంతో, వారు తాకట్టు పెట్టిన ఖరీదైన ఆస్తులను వేలం వేసేందుకు బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు రంగం సిద్ధం చేశాయి. ముఖ్యంగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఈ వేలం ప్రక్రియను చేపట్టింది. బుట్టా రేణుక, ఆమె భర్త బి.ఎస్.నీలకంఠ 2018లో తమ వ్యాపార అవసరాల కోసం ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నుండి సుమారు రూ. 310 కోట్ల రుణాన్ని తీసుకున్నారు. బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్, మెరిడియన్ ఎడ్యుటెక్ సర్వీసెస్ వంటి తమ సంస్థల నిర్వహణ కోసం ఈ నిధులను వినియోగించారు. 15 ఏళ్ల కాలపరిమితితో తీసుకున్న ఈ రుణానికి సంబంధించి ప్రారంభంలో కొన్ని వాయిదాలు చెల్లించినప్పటికీ, గత ఐదేళ్లుగా వారు చెల్లింపులను పూర్తిగా నిలిపివేసినట్లు సమాచారం. వడ్డీతో కలిపి ఈ బకాయిలు ప్రస్తుతం రూ. 340 కోట్ల నుండి రూ. 360 కోట్ల వరకు చేరాయివాయిదాలు చెల్లించకపోవడంతో బకాయిల వసూలు కోసం ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ హైదరాబాద్‌లోని అత్యంత విలువైన ప్రాంతాల్లో ఉన్న పలు ఆస్తులను వేలానికి పెట్టింది. హైదరాబాద్ కేపీహెచ్‌పీ కాలనీలో సర్వే నెంబర్ 1009లోని 3823 చదరపు గజాల స్థలాన్ని వేలం వేయడానికి ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ఫైనాన్స్ బెంగళూరు బ్రాంచి అధికారిక ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం ఆ స్థలంలో మెరిడియన్ స్కూల్ కొనసాగుతుంది. అయితే, మార్చి 24న ఈ స్థలాన్ని ఎల్ఐసీ వేలం వేయబోతోంది. మెరిడియన్ స్కూల్ ఉన్న ఆస్తి కనీసం విలువ రూ.65కోట్లుగా అధికారులు నిర్ణయించారు. బుట్టా రేణుక 2014 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున కర్నూలు ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బుట్టా రేణుక తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్రకటించారు. మళ్లీ 2019 ఎన్నికల సమయానికి తిరిగి వైసీపీ గూటికి చేరుకున్నప్పటికీ.. ఆమెకు టికెట్ దక్కలేదు. వైసీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమించారు. 2024 ఎన్నికల్లోనూ ఆమెకు ప్రత్యక్షంగా పోటీ చేసే అవకాశం రాలేదు. ఆ తరువాత ఆమె క్రియాశీల రాజకీయాల్లో పెద్దగా కనిపించడం లేదు. బంజారాహిల్స్‌లోని సుమారు 5,000 గజాల ఖరీదైన స్థలం వేలానికి వచ్చింది. దీని రిజర్వు ధర సుమారు రూ. 145 కోట్లుగా నిర్ణయించారు. మాదాపూర్‌లోని 7,205 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ప్రముఖ బుట్టా కన్వెన్షన్ సెంటర్ కూడా వేలం జాబితాలో ఉంది. గతంలో కూడా వీటిని వేలం వేయాలని ప్రయత్నించినప్పటికీ, సాంకేతిక కారణాల వల్ల లేదా వేలం దారుల నుండి స్పందన లేకపోవడం వల్ల ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. బుట్టా రేణుక కుటుంబం కేవలం రాజకీయాల్లోనే కాకుండా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటిగా పేరుగాంచిన బుట్టా గ్రూప్ ను నిర్వహిస్తోంది. ఈ గ్రూపు పలు రంగాల్లో విస్తరించింది. విద్యారంగం, ఆటోమొబైల్ రంగం, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోన్నట్లు తెలుస్తోంది. ఇంకా పలు రంగాల్లో వీరికి పెద్దఎత్తున పెట్టుబడులు ఉన్నట్లు సమాచారం.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం...

-మొదటిపేజీ తరువాయి

ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయాలను కూడా కేబినెట్ ధృవీకరించింది. కొల్లేరు అభయారణ్య సరిహద్దుల ఖరారుకు సంబంధించి కేంద్రానికి పంపాల్సిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అలాగే, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 28న పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ రోజు అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని కూడా తీర్మానించారు. సమావేశం సందర్భంగా రాజమండ్రిలో కల్తీ పాల ఘటన, శ్రీకాకుళంలో డయేరియా కేసులు ప్రబలడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరో ఆసక్తికర అంశంగా, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రసంగాలను కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో విశ్లేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిపై చర్చకు మంత్రులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కూడా సూచించారు. తాజా నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి

## కల్తీ నెయ్యి మహాపాపం

-మొదటిపేజీ తరువాయి

23.01.2026న సీబీఐ ఛార్జిషీట్ వేసిందని తెలిపారు. ఇంక కల్తీ నెయ్యి తయారీకి చాలా రసాయనాలు వాడారని అన్నారు. మోనో గ్లిసరైడ్స్, లాక్టిక్ యాసిడ్ యానిమల్ వెజిటబుల్ ఫ్యాట్ నుంచి వస్తుందని, రంగు కోసం బీటా కెరాటిన్, వాసన కోసం ఎపిటిక్ యాసిడ్ ఈస్టర్, నెయ్యిలా కనిపించడానికి సింథటిక్ ఫ్లేవర్, నురుగు రావడానికి లబ్సా యాసిడ్ డిజర్టెంట్‌లో వాడతారని సీఎం వివరించారు. రాజకీయ వివాదం ఉండకూడదని సిట్ ఏర్పాటు: రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారని సీఎం చంద్రబాబు తెలిపారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించిందని అలానే తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించిందని వెల్లడించారు. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించామని అన్నారు. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారని ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలిందని చెప్పారు. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారని వెల్లడించారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని తాను సొంతంగా ఏమీ చెప్పలేదు ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పానని ఆ భగవంతుడే నాతో చెప్పించాడని సీఎం చంద్రబాబు అన్నారు. వారికి అనుగుణంగా నిబంధనలన్నీ సడలించారని రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధన తొలగించారని సీఎం చంద్రబాబు అన్నారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించారని అలానే రోజుకు 12 టన్నులుగా ఉండాల్సిన వెన్న తయారీ 8 టన్నులకు తగ్గించారని తెలిపారు. డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారని వెల్లడించారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చి ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారని మండిపడ్డారు. వారికి తెలియకుండా జరుగుతాయా: పోమిల్ జైన్, విపిన్ జైన్, భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ ప్రధాన సూత్రధారులని సీఎం వివరించారు. నెయ్యి సరఫరా చేసిన షెల్ కంపెనీలు ఏఆర్ డెయిరీ ఫుడ్స్, శ్రీవైష్ణవి డెయిరీ, మాల్ గంగా మిల్క్ డెయిరీ అని భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలు సహకరించాయని తెలిపారు. లంచం డబ్బుతో చిన్నప్పన్న దొరికిపోయారని ఈ కల్తీ నెయ్యి సరఫరాదారులకు చిన్నప్పన్న సహకారం అందించారని చెప్పారు. తప్పుడు రిటర్నులతో బురిడీ కొట్టించి ల్యాబ్ నివేదిక ఫోర్జరీ చేశారని వివరించారు. ఇన్ని జరిగితే టీటీడీ బోర్డు ఈవో, ఛైర్మన్‌కు తెలియకుండా జరుగుతాయా అని ప్రశ్నించారు. ప్రసాదం తీసుకున్న ప్రతి ఒక్కరూ నాణ్యత తగ్గిందని చెప్పారని సీఎం తెలిపారు.

## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

-మొదటిపేజీ తరువాయి

కరీంనగర్‌లో ఇంటర్ విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఇంటర్ చేసేటపుడు విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. కరీంనగర్, కోరుట్ల ఆర్ఎస్‌యూ అధ్యక్షుడిగా పనిచేసిన తిరుపతి 1978లో జగిత్యాల జైత్రయాత్రతో ఆకర్షితుడయ్యాడు. అనంతరం1982లో సీపీఐఎంఎల్ పీపుల్స్ వార్‌లో చేరి 1984లో గణపతి సూచనలు చేయగా తిరుపతి, మల్లా రాజిరెడ్డి దండకారణ్యానికి వెళ్లారు.

**సెంట్రల్ మిలిటరీ కమిషన్**

మహారాష్ట్ర దండకారణ్యంలో దేవ్‌జీ అజ్ఞాత జీవితం గడిపారని డీజీపీ పేర్కొన్నారు. తిరుపతి గడ్చిరోలి జిల్లా కార్యదర్శిగా దేవ్‌జీ పనిచేశాడని 2001లో సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా పదోన్నతి పొందినట్లు తెలిపారు. మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యి 2017లో సెంట్రల్ మిలిటరీ కమిషన్ పూర్తి ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టినట్లు ఆయన వివరించారు. మల్లోజుల వేణుగోపాల్ బయటకు వచ్చాక మావోయిస్టు అధికార ప్రతినిధిగా దేవ్‌జీ వ్యవహరించారని, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ ఇన్‌ఛార్జ్‌గా దేవ్‌జీ వ్యవహరిస్తున్నారని డీజీపీ వెల్లడించారు.

**రాజిరెడ్డిది మంథని శాస్త్రపల్లి గ్రామం**

మల్లా రాజిరెడ్డి సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారని ఆయన స్వస్థలం పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రపల్లి గ్రామమని తెలిపారు. మల్లా రాజిరెడ్డిది వ్యవసాయ కుటుంబ నేపథ్యమన్న డీజీపీ 1975లో పెళ్లి తర్వాత భార్య రత్నమ్మతో అజ్ఞాతంలోకి వెళ్లారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో 1998లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రత్నమ్మ చనిపోయారని అన్నారు. మల్లా రాజిరెడ్డి 1974లో ఆర్ఎస్‌యూలో చేరి కిషన్‌జీ మావోయిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడయ్యారన్నారు. 1980లో సీపీఐఎంఎల్ పీడబ్ల్యూ ప్రారంభించాక బొగ్గు గనుల ప్రాంతంలో ఉద్యమ నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు.

## ఏటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక డ్యాష్ బోర్డు తయారు చేసి అందుబాటులోకి తెచ్చేందుకు 20 నెలలు పట్టిందని వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల వారీగా ఎంత మంది పిల్లలు చదువుతున్నారు, ఎంత మంది అధ్యాపకులు ఉన్నారో డేటా తయారు చేశామని దీని ప్రకారం అవసరమైన పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. కళాశాలల్లో మిడ్ డే మీల్?ను ప్రారంభించి ల్యాబ్?లను ఆధునికీకరించామని, జూనియర్ కళాశాలల్లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. డీఎస్సీ నిర్వహించి ఖాళీ పోస్టులు భర్తీ: ప్రతి ఏటా రిటైర్మెంట్ ప్రకారం ఖాళీలు గుర్తించి ఎప్పటి కప్పుడు టీచర్ల నియామకాలు చేపడతామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది డీఎస్సీని నిర్వహించి ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదని కూటమి ప్రభుత్వం వచ్చాక 16,000 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల్లో అధ్యాపకుల కొరత, సమస్యలపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, కావలి గ్రీష్మ, బీటీ.నాయుడు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఎస్సీఈఆర్టీని కూటమి ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్న మంత్రి పాఠశాలల్లో కరిక్యులమ్?ను మార్చి బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల్లో ఇన్ ఫ్రా, డైట్?ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పిల్లల సత్ప్రవర్తన పెంచేందుకు చాగంటి కోటేశ్వరరావు ద్వారా ప్రవచనాలు అందిస్తున్నామని, ఏఐ సాంకేతికతను వినియోగించి విద్యార్థుల మెంటల్ హెల్త్ మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. లోకేశ్ పనితీరుపై హైకోర్టు ప్రశంస: మంత్రి నారా లోకేశ్ పని తీరును హైకోర్టు ప్రశంసించింది. కస్తూర్బా పాఠశాలల్లో ఉపాధ్యాయుల జీతాలు పెంచి పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేస్తామని మంత్రి ప్రకటన చేశారని వ్యాఖ్యానించింది. సమస్యలపై మంత్రి లోకేశ్ తక్షణమే స్పందించి పరిష్కరిస్తున్నారని తెలిపింది. వసతి గృహంలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనపై మంత్రి లోకేశ్ వెంటనే స్పందించారని కితాబిచ్చింది. మంత్రి ఆస్థాయిలో పనిచేస్తుంటే, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారని హైకోర్టు మండిపడింది.

**ఉద్యోగుల ఆరోగ్య కార్డులు - Cashless (EHS) ఇచ్చినందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.**

**హైదరాబాద్ ఫిబ్రవరి24( సమయం న్యూస్,):** ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు మరియు తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరు మార్చి డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ గా మారుస్తూ, ఉద్యోగులకు 1.20 కోట్ల ప్రమాద బీమా, 60 సంవత్సరాల లోపు సహజ మరణం చెందితే 10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ మంజూరు జేయడం లాంటి రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయం తీసుకున్న సందర్భంగా తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, కార్మిక, ఉపాధ్యాయుల, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ శ్రీ మారం జగదీశ్వర్ మరియు సెక్రటరీ జనరల్ శ్రీ ఏలూరి శ్రీనివాసరావు, ఎస్.ఏం.హుస్సేనీ ముజీభ్ ఉప సెక్రటరీ జనరల్ &GS, TNGOµS Central Union హర్షం తెలియజేశారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు, ఉద్యోగుల ఉపసంఘం చైర్మన్ శ్రీ మల్లు భట్టివిక్రమార్క గారు, ఉప ముఖ్యమంత్రి, శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పరిశ్రమలు ల ఐటీ మంత్రి, శ్రీ పొన్నం ప్రభాకర్ గారు, రవాణా శాఖ మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనరసింహ గారికి, మరియు IAS అధికారుల కమిటీ సభ్యులైన శ్రీ నవీన్ మిట్టల్, శ్రీ లోకేష్ కుమార్, ప్రతేకించి శ్రీ కె. రామకృష్ణారావు, IAS, ప్రధాన కార్యదర్శి గారికి ధన్యవాదములు తెలిపారు గతం లో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యగులను ప్రపంచ బ్యాంకు షరతులు అంగీకరించి నాటి ప్రభుత్వం వైద్య విధాన పరిషత్ ఏర్పాటు చేసి ఎంతో మంది ఉద్యోగులను మానసిక ఒత్తిడి కి గురిచేసిందని వైద్యవిధాన పరిషత్ ఉద్యగులకు నెలనాడు జీతాలు రాక అలాగే ప్రభుత్వం నుండి లభించే ఎలాంటి సౌకర్యాలు లభించేవి కావని వారి సమస్యల పరిష్కారానికి ౧+జుజీూజ తరుపున ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చామని ఈ ప్రజాప్రభుత్వం 12500 మంది ఉద్యోగస్తులకు అలాగే 200 హాస్పిటల్స్ ఒక గొప్పవరం ఇక నుండి వారికి 010 పద్దు కింద నెలసరి జీతభత్యాలు మరియు ఇతర ప్రయోజనాలు పొందుతారని అలాగే వైద్యవిధాన పరిషత్ లో పనిచేసే స్టాఫ్ నర్స్ లకు నర్సింగ్ ట్యూటర్ గా వెళ్ళే అవకాశం లభిస్తుందని ఇది TGEJAC సంఘాల ఐక్యాతకు నిదర్శనమని వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, కార్మిక, ఉపాధ్యాయుల, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ బాగస్వామ్యాసశీగాలా నిరంతర కృషి వల్ల ఉద్యోగుల ఆరోగ్య కార్డులు ( మరియు వైద్య విభాగం 010 పద్దుక్రింద జీతాలు తిసూకునే ప్రక్రియా సాద్యమైంది. అలాగే భవిష్యతులో కూడ ప్రధాన డిమాండ్లైనా౹ా=జ మరియు పెండింగ్ బిల్లులను నేలకు 700 కోట్ల నూండి 1500 కోట్లకు ఐక్యాంగా ఉండి హక్కులు సాదినుకుందాం.

ఇట్లు;మారం జగదీశ్వర్, చైర్మన్ ,,ఏలూరి శ్రీనివాసరావు,సెక్రటరి జనరల్, TGEJACఎస్.ఏం. హుస్సేనీ ముజీభ్

# మూసి సుందరీకరణ కోసం భూసేకరణ నోటిఫికేషన్లు జారీ

● ఆర్డీవో వెంకట్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 24:( సమయం న్యూస్).:** మూసి సుందరీకరణ ప్రాజెక్టు భాగంగా భూసేకరణ ప్రక్రియను ప్రారంభించినట్లు రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ పరిధిలోని రెండు డివిజన్లలో భూసేకరణ కోసం నోటిఫికేషన్లు జారీ చేసినట్లు వెల్లడించారు. కిస్మత్‌పూర్ మరియు దర్గా ప్రాంతాల్లో రెండు నోటిఫికేషన్లు ఇప్పటికే విడుదల చేసినట్లు చెప్పారు.భూసేకరణకు సంబంధించి బండ్ కింద 500 మీటర్ల పరిధిలో ఎలాంటి కొత్త నిర్మాణాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టు అవసరాల మేరకు ఆ పరిధిలో ఉన్న నిర్మాణాలను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. బండ్లగూడ జాగీర్, ఉప్పర్‌పల్లి ప్రాంతాల్లో కూడా నిర్మాణాల స్వాధీనం ప్రక్రియ కొనసాగుతోందన్నారు.మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ బఫర్ జోన్ పరిధిలో ఉందని, అయితే గతంలో అన్ని అనుమతులతోనే నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రాజెక్టు దృష్ట్యా మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించి ఆ అపార్ట్‌మెంట్‌ను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. 50 మీటర్ల లోపు ఉన్న నివాసాలను దశల వారీగా అభిప్రాయ సేకరణ అనంతరం స్వాధీనం చేసుకుంటామని వెల్లడించారు.భూసేకరణ మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ఎవరికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆర్డీవో వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాదా పూర్వకంగా కలిసిన శిక్షణ ఐ పి ఎస్ ఆయేషా ఫాతిమా



**సిద్ధిపేట ఫిబ్రవరి24( సమయం న్యూస్) :**మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో శిక్షణ ఐపిఎస్ ఏంఎస్. అయేషా ఫాతిమా జిల్లా కలెక్టర్ కె. హైమావతి ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలో శాంతి భద్రతల విషయాల గురించి క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శిక్షణ ఐపిఎస్ అధికారికి సూచించారు.

# ఇది రియల్ ఎస్టేట్ సర్కార్ !

● ప్రజాపాలన కాదు రాష్ట్రంలో ప్రజా వంచన జరుగుతున్నది

● మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి.

**హైదరాబాద్ ఫిబ్రవరి24( సమయం న్యూస్,). :** హైదరాబాద్ లో మూసీ పరిసరాల్లో రూ.5 వేల కోట్లతో గాంధీ విగ్రహం కోసం 500 కుటుంబాలు, 2500 జనాభా నివసిస్తున్న ప్రాంతాన్ని చెరబట్టాలనుకోవడం దుర్మార్గం గాంధీ మహాత్ముడి మనవడు తుషార్ గాంధీ స్వయంగా మా తాత పేరుతో ఇలాంటి పనులు చేయకండి. మా తాత గారు బతికి ఉన్నా ఇలాంటి చర్యలను సమర్థించరు అని నోరు సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు 500 కుటుంబాలు గత కొన్నాళ్లుగా కంటి మీద కునుకు లేక, తిండి సహించక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అయినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదుతాజాగా నిన్న జరిగిన కేబినెట్లో కూడా ప్రజలకు ఇచ్చిన హామీల పట్ల గురించి, ఇవ్వాల్సిన రైతుభరోసా గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు తెలంగాణ ప్రభుత్వంలో సీఎం, మంత్రులు భూములను కేకు ముక్కలుగా చేసి పంచుకుంటున్నారుతెల్లారేసరికి ఖమ్మం కలెక్టరేట్ సమీపంలోని వెలుగుమట్లలో భూదాన్ భూములలో పదేళ్లుగా ఉన్న పేదల ఇళ్ల మీద పద్దారు లాఠీలను అడ్డం పెట్టుకొని ఈ ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాలను లూఠీ చేస్తుందిపేదలు, మధ్యతరగతి వర్గాలు జీవితకాలం కష్టపడి నిర్మించుకున్న ఆశల సౌధాలను కూల్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు గాంధీ విగ్రహాన్ని అడ్డం పెట్టుకుని వేల కోట్ల దోపిడీకి ఈ సర్కారు పెద్దలు రంగం సిద్ధం చేసుకుంటున్నారు హైదరాబాద్ లో గాంధీ విగ్రహం ఏర్పాటు పేరిట మధ్య తరగతి ప్రజల ఇండ్లను కూల్చివేయడానికి ప్రయత్నిస్తున్న సర్కారు తీరును ఒక ప్రకటనలో ఖండించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

# కార్మిక హక్కులు భద్రత కోసం ఈ ఎస్ ఐ



**హైదరాబాద్ ఫిబ్రవరి24( సమయం న్యూస్) :** సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో నిర్వహించిన ఈఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, ఈఎస్ఐసీ రీజినల్ డైరెక్టర్ రాజీవ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దూరదృష్టితోనే కనీస వేతనాలు, కార్మికుల హక్కులు, వారి భద్రత కోసం ఈఎస్ఐ కార్పొరేషన్ స్థాపించబడిందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న ఆ నిర్ణయం దేశంలోని లక్షలాది కార్మిక కుటుంబాలకు ఆరోగ్య భరోసాను కల్పించిందన్నారు.తన కుటుంబానికి కార్మిక సంక్షేమంతో ప్రత్యేక అనుబంధం ఉందని, తన తండ్రి కేంద్ర మరియు రాష్ట్ర కార్మిక మంత్రిగా సేవలందించారని మంత్రి గుర్తు చేశారు. గతంతో పోలిస్తే ఈఎస్ఐ ఆసుపత్రుల్లో సదుపాయాలు విస్తృతంగా మెరుగుపడ్డాయని తెలిపారు.రోగికి వైద్యంతో పాటు ధైర్యం ఇవ్వడం కూడా వైద్యుల బాధ్యత అని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై విమర్శలు వినిపించినా, ఈఎస్ఐ ఆసుపత్రుల సేవలపై పెద్దగా ఫిర్యాదులు రావని ఆయన అన్నారు .దేశంలోని పేదలకు అత్యవసరంగా అవసరమయ్యేవి విద్య, వైద్యం మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ఈ కాలంలో, ఈఎస్ఐ వంటి సంస్థలు కార్మికులకు నాణ్యమైన వైద్యసేవలను అందించడం అభినందనీయమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికులకు వైద్య సేవల విషయమా లో చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ఈఎస్ఐ సేవలను మరింత విస్తరించేందుకు ముఖ్యమంత్రి శంషాబాద్‌లో కొత్త ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయించేందుకు సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.చెన్నూరులో 50 పడకలతో ప్రారంభమైన చిన్న ఆసుపత్రి ప్రస్తుతం పూర్తిస్థాయిలో సేవలందిస్తోందని మంత్రి తెలిపారు. అలాగే 18 జుూ×జ డిస్పెన్సరీలు రద్దవుతున్నాయన్న సమాచారం అందిన వెంటనే కేబినెట్‌లో చర్చించి, వాటి నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.ఈఎస్ఐ ఆసుపత్రిలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించడం గొప్ప విషయమని, అవయవదాతలకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈఎస్ఐ ద్వారా కార్మికులకు మరింత విస్తృతంగా, సమర్థవంతంగా సేవలు అందేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

# ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నిర్మల్ ఫిబ్రవరి24( సమయం న్యూస్) :** ఇంటర్మీడి యట్, పదవ తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హైదరాబాద్ నుంచి, ఇంటర్మీడియట్, పదవతరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలిసి, అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఎస్ఎస్ సి, ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణపై పలు అంశాలను చర్చించారు. పరీక్షల నిర్వహణపై వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఇంటర్మీడియట్, పదవతరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ కు సంబంధించి జిల్లాల్లో మొత్తం రేపటి నుంచి, మార్చి 18 వరకు, 6652 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు, 6473 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, మొత్తం కలిపి 13125 విద్యార్థులు, 23 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని అన్నారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి మార్చి 14వ తేదీ నుంచి, ఏప్రిల్ 16 వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి, 12.30 వరకు, 47 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 9758 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద, పరీక్షా పత్రాల తరలింపు సమయంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు, సరైన లైటింగ్, సిబ్బందితో కూడిన వైద్య శిబిరం, తదితర అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా, పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సులను నడపాలని పేర్కొన్నారు. పరీక్షలు జరుగుతున్నతసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు మూసివేసి, బిఎన్ఎస్ సెక్షన్ 163 (సీఆర్పీసీ 144) అమలు చేయాలని అన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, పారదర్శకంగా పరీక్షలను పూర్తి చేయాలని తెలిపారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, డిఐఈఓ పరుశురాం, డిపివో శ్రీనివాస్, ఖజానా శాఖ అధికారి సరోజ, డిఎంహెచ్ఓ రాజేందర్, రవాణా శాఖ అధికారి దుర్గా ప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



# డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**నారాయణపేట, ఫిబ్రవరి,24(సమయం న్యూస్) :** రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన ‘ూతీతీఱజవ ూశ్రీఱజవ’ 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ మరియు పోలీస్ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, ముఖ్యంగా డ్రైవర్లకు కలర్ బ్లైండ్, వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం జరుగుతుంది అని అలాంటి వారికి చికిత్స ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని తగిన జాగ ముఖ్యంగా డ్రైవర్లకు సమస్యలు లేకుండా కంటి చూపు సక్రమంగా ఉండటం అత్యవసరమని తెలిపారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని చెప్పారు.జిల్లా వ్యాప్తంగా ఆటో, టాక్సీ డ్రైవర్‌కు కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడమే కాకుండా, తగిన చికిత్సలు కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందించబడతాయని ఎస్పీ వివరించారు.డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై పలు ముఖ్య సూచనలు చేశారు.వాహనాలు నడిపేటప్పుడు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలను పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, కారులో సీట్ బెల్ట్ మరియు ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదని, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్యూసీ, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ పేర్కొన్నారు.ఈ శిబిరం ద్వారా మొత్తం 70 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీఏఆర్ ఎండి రియాజ్ హూల్ హాక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివ శంకర్, ఆర్ఐ లు నరసింహ, విజయ్ భాస్కర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ లు సునీల్,మల్లికా, సాయి ఆదిత్య, కనిగిరి శేఖర్ టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య, ఆర్ ఎస్సైలు శ్వేత, శిరీష, పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఇంటర్ ఎస్ ఎస్ సి పరీక్షలు ప్రారంభ తర్వాతి 5 నిముషాలు హాజరు కు అనుమతి.

● ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణ రావు.



**హైదరాబాద్ , ఫిబ్రవరి 24( సమయం న్యూస్).** రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియేట్ ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య , పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ , ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెన్ట్ గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్ ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రం లో ఒక ఏ.ఎన్.ఎం , ఫస్ట్ ఎయిడ్ కిట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమర్జెన్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ప్రతీ పరీక్ష ప్రశ్న పత్రానికి ప్రత్యేకంగా౹ు.= కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా మాత్రమే ప్రశ్నా పత్రాలను ఓపెన్ చేయాలని స్పష్టం చేసారు. ఈసారి మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు.

# ఉపవాసాల లక్ష్యం దైవభీతి

**ఖమ్మం , ఫిబ్రవరి 24 : ( సమయం న్యూస్ ) :** ఉపవాసాల లక్ష్యం దైవభీతి , తద్వారా మానవులలో నైతిక విలువల ప్రవర్తన తీర్చిదిద్దడం అని జమా ఆతే ఇస్లామీ హింద్ జిల్లా మహిళా పబ్లిక్ రిలేషన్ కన్వీనర్ హాజీరా సదఫ్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం లో రాపర్తి నగర్ లో ఉన్న తెలంగాణ మైనారిటీ ఖమ్మం గర్ల్స్ కాలేజీ లో విద్యార్థులకు సోమవారం సాయంత్రం

ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ దైవభీతి జనింప చేసి నైతిక ప్రవర్తన తీసుకు రావడమే ఉపవాసం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆన్నారు. ఉపవాసం అనేది అన్ని మతాలవారు ఆచరిస్తారని అన్నారు. ఉపవాసం పాటించినప్పుడే మనిషి లో దైవభీతి నిగ్రహ శక్తి , సహనం పెరగడం తో పాటు మనిషికి అకలి భాధ తెలుస్తుందని అన్నారు ఇతరుల ఆకలి బాదను ఆర్థం చేసికోగల్గుతాడన్నారు. ఉపవాసం మనిషిని సంస్కరిస్తుందని , సంస్కారమైన వ్యక్తుల ద్వారానే సత్సమాజం ఏర్పడుతుందన్నారు, కాబట్టి ప్రతి ఉపవాసి మనోవాంచలకు దూరంగా వుడడంతో పాటు సమాజంలో మంచిని పెంచి , చె డు ను పారద్రోలే ప్రయత్నం చేయాలన్నారు. అంతిమ దైవ గ్రంధమైన ఖుర్అన్ అవతరించడం వల్లనే ఈ రంజాన్ నెలకు ఇంతటి ప్రాధన్యత చేకూరిందని , ఇది సమస్త మానవాళికి మార్గదర్శకమన్నారు. ఉపవాసం వల్ల



శాస్త్రీయంగా లాభాలను గురించి వివరించారు అనంతరం కో కన్వీనర్ జహీరా ఫాతియా మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు.కొత్త విషయాలు కంటే చదివిన వాటిని పదేపదే రివిజన్ చేయటం వల్ల గుర్తుండటం సులభతరం అవుతుందని అన్నారు ఆత్మవిశ్వాసంతో పరీక్షకు సిద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించి మైనార్టీ గురుకుల కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్ , సభ్యులు నస్రీన్, సుమయ్య తరున్నం , కళాశాల ప్రిన్సిపాల్ అఖిల , ఉపాధ్యాయులు , విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**-- జిల్లా కలెక్టర్లకు చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు దిశా నిర్దేశం**

**నారాయణపేట, ఫిబ్రవరి,24(సమయం న్యూస్) :** రాష్ట్రంలో ప్రారంభమవుతున్న ఎస్ఎస్సి,ఇంటర్మీడి యట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె .రామకృష్ణారావు మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ మందిరం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించబోయే పబ్లిక్ పరీక్షల కోసం విద్య, వైద్య, పోలీసు తదితర సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుండి మార్చి18 వరకు, అలాగే పదవ తరగతి (ఎస్ఎస్సి) పబ్లిక్ పరీక్షలు మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని, మాస్ కాపీయింగ్, చీటింగ్, మాల్ప్రాక్టీస్, ప్రశ్నాపత్రాల లీకేజీ వంటి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ ఆదేశించారు.విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి యోగితా రాణా మాట్లాడుతూప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులు కూర్చోవడానికి తప్పనిసరిగా డబుల్ డెస్క్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని, గాలి, వెలుతురు సదుపాయం కలిగిన తరగతి గదులు ఉండేలా చూడాలని సూచించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు



కల్పించాలని ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఆశా వర్కర్ల ద్వారా హెల్త్ డెస్క్లు ఏర్పాటు చేయాలని సూచించారు.మాస్ కాపీయింగ్, పేపర్ చిట్స్ లేదా ఇతర మార్గాల ద్వారా చీటింగ్ అక్రమాలకు పాల్పడే వారికి ఉపేక్షించరాదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని స్పష్టం చేశారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి సిట్టింగ్ స్క్వాడ్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి చీటింగ్ జరుగకుండా కట్టుదిట్టమైన నిఘా ఉండేలా చూడాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి బి.ఎన్.ఎస్ సెక్షన్ 163, సి.ఆర్.పి.సి సెక్షన్ 144 అమలు చేయాలని ఆదేశించారు.ప్రశ్నాపత్రాల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వాటిని పోలీస్ పహారాలో పరీక్షా కేంద్రాలకు తరలించి, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్లలో భద్రపరచాలని సూచించారు. ప్రశ్నాపత్రాల కవర్లను పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందు మాత్రమే సీసీటీవీ నిఘాలో తెరవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్షల సమయంలో మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.విద్యార్థులు పరీక్షకు గరిష్టంగా 5 నిమిషాల ఆలస్యంతో వచ్చినా అనుమతించాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో క్లాక్ రూమ్ ఏర్పాటు చేసి, విద్యార్థులు తెచ్చే పుస్తకాలు, బ్యాగులు, ఇతర వస్తువులను అక్కడే ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాల్ టికెట్ మరియు అవసరమైన స్టేషనరీతో మాత్రమే విద్యార్థులకు పరీక్షా కేంద్రంలో ప్రవేశం కల్పించాలని తెలిపారు. హాల్ టికెట్లను వెబ్సైట్ లేదా వాట్సాప్ ద్వారా డౌన్లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో నిర్వహించబోయే ఇంటర్మీడియట్, ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలను నిర్వహించేందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను ఎస్.పి.డాక్టర్ వినీత్ ఆర్.డి.ఓ. రామచందర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు..




## పదవ తరగతి,ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట, ఫిబ్రవరి,24(సమయం న్యూస్) :** పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వి. సి.హాల్ లో ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు.తేదీ.25.02.2026 బుధవారం నుంచి 16.03.2026 వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు, తేదీ.14.03.2026 నుంచి తేదీ.16.04.2026 వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఇంటర్మీడియట్ పరీక్షల కోసం జిల్లాలో ఇంటర్ మొదటి ,రెండవ సంవత్సరం 8192 మంది విద్యార్థులకు 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఎస్ఎస్సి పరీక్షలలో 8318 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని 43 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పరీక్షలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ చీటింగ్ వంటివి జరగకుండా చూడటానికి ముగ్గురు అధికారుల బృందంతో కూడిన ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ను ఏర్పాటు చేశామని అన్నారు.విద్యార్థులు సరైన సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా సమయానికి ప్రత్యేక బస్సులను సిద్ధం చేసినట్లు,పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు కేవలం హాల్టికట్ తప్ప ఎలాంటి వస్తువులను తీసుకు వెళ్లడానికి అనుమతి లేదని, తమ వస్తువులను భద్రపరచడానికి క్లోక్ రూమ్ సిద్ధం చేశామని,పరీక్ష కేంద్రాల సమీపంలోని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బి.ఎస్.ఎన్ సెక్షన్ 163 ( సి ఆర్ పి సి 144) అమలు చేయాలని, జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని అన్నారు.పరీక్ష కేంద్రం వద్ద పరీక్ష పత్రాల తరలింపులో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, అన్ని పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు త్రాగునీరు సౌకర్యవంతమైన బెంచి లను , లైటింగ్, వైద్య శిబిరం తదితర వసతులను కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8:30 నిమిషాలకే చేరుకోవాలని మధ్యాహ్నం 12 గంటల కు పరీక్ష పూర్తి అయిన తరువాతనే పరీక్షా కేంద్రాల నుంచి బయటికి వెళ్లాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్.పి.డాక్టర్ వినీత్ అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,ఆర్ ఆర్.డి.ఓ.రామచందర్,డి ఐ ఈ ఓ, డీఈవో, ఆర్టీసీ డి. యం.సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.,.



## సోమలింగేశ్వర ఆలయం వద్ద కొండపై ఉన్న జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో ఘన పూజలు

**బాన్సువాడ,ఫిబ్రవరి 24( సమయం న్యూస్) :** బాన్సువాడ డివిజన్ కేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న సోమలింగేశ్వర ఆలయం గుట్టపై కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ జ్ఞాన సరస్వతి దేవి మాతకు మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దుర్కి పబ్బతి రాజు గురుస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, ధూపం, దీపం, నైవేద్య సమర్పణలు చేసి మహామంగళ హారతులు ఇచ్చారు.దుర్గి పబ్బతి రాజు గురుస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని హనుమాన్ దీక్ష స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. అంతకుముందు స్వాములు ఆలయ ప్రాంగణంలో భజనలు నిర్వహించి, సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హనుమాన్ దీక్ష మూలమంత్రాన్ని సామూహికంగా జపించారు.బాన్సువాడ, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల నుండి సుమారు 150 మంది స్వాములు పాల్గొని భిక్ష స్వీకరించారు. దైవనామ స్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏడే మోహన్, గురుస్వామి ఎరాజ్పల్లి గంగన్న, హనుమాన్ దీక్ష స్వాములు అంబిలిపూర్ రాజు, పాలకుర్తి దత్తు, శ్రవణ్ తదితరులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, భక్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

**జ్ఞాన సరస్వతి మాత ఆలయం అభివృద్ధికి కృషి చేయాలి**

సోమలింగేశ్వర ఆలయం గుట్టపై ఉన్న జ్ఞాన సరస్వతి మాత ఆలయం అభివృద్ధికి భక్తులు, గ్రామస్తులు కృషి చేయాలని కోరుతున్నారు. విగ్రహ ప్రతిష్ట జరిగి 25 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, నిత్య పూజలు సక్రమంగా జరగకపోవడం, సరైన దారి లేకపోవడం, చుట్టుపక్కల సౌకర్యాలు లేకపోవడం వంటి సమస్యలు ఆలయ అభివృద్ధికి అడ్డంకిగా మారాయి.ఆలయానికి వెళ్లే మార్గంలో ఆదిదేవుడు గణపతి విగ్రహం కూడా ఉన్నప్పటికీ, గణపతి మరియు జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు శాశ్వత గూడు లేకపోవడం విచారకరం.ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ధర్మకర్తలు, భక్తులు స్పందించి ఆలయ అభివృద్ధికి ముందుకు రావాలని అమ్మవారి భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గోదావరి పుష్కర ఏర్పాట్లపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**● కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్ ఫిబ్రవరి 23 ( సమయం న్యూస్).:** వచ్చే ఏడాది 2027 జూలై 23 నుండి ఆగస్టు 03వ తేదీ వరకు జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఇలా త్రిపాఠితో, ఇతర జిల్లా అధికారులతో పుష్కర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన కందకుర్తి, తాడ్ బిలోలి, కోస్లీ, తుంగిని, బినోల, ఉమ్మెడ, పోఛంపాడ్,. సావెల్, తడ్పాకల్, దోంచంద, గుమ్మిర్యాల్ వద్ద పుష్కర ఘాట్లు ఉంటాయని, వీటితో పాటు అనువైన ఇతర గోదావరి పరీవాహక ప్రదేశాలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించవచ్చని అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గోదావరి నది తీరంలో సౌకర్యాల కల్పన దిశగా పుష్కర ఘాట్ల వద్ద చేపట్టాల్సిన పనులను గుర్తించాలన్నారు. వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి తన ఛాంబర్ లో అధికారులతో సమావేశం నిర్వహించారు. గత పుష్కరాలలో గోదావరి నదిలో పుష్కర స్నానం చేసిన భక్తుల సంఖ్య, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్టాళ్లు, తాగునీరు, తాత్కాలిక గదులు, వాహనాల పార్కింగ్, భద్రత, రూట్ మ్యాప్ ఇతర ఏర్పాట్ల వివరాలను పరిశీలించి, ఆయా శాఖల వారీగా సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉన్నందున అన్ని అంశాలను నిశితంగా పరిశీలన జరపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్టీసీ ఆర్.ఎం జ్యోత్స్న, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత కోసం" షీ" టీమ్ ప్రత్యేక చర్యలు

**● సబ్‌డివిజన్ “షీ” టీమ్ ఇంచార్జ్ నర్సిములు**

**● జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,డీఎస్పీ శ్రీనివాస్ అదేశాలమేరకు**




**పరిగి మున్సిపల్(మం)ఫిబ్రవరి,24(సమయం న్యూస్) :** మహిళలు, బాలికల భద్రతను పరిరక్షించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న “షీ” టీమ్ సమర్థవంతంగా సేవలందిస్తోందని పరిగి సబ్‌డివిజన్ “షీ” టీమ్ ఇంచార్జ్ నర్సిములు అన్నారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇండస్ వాలీ స్కూల్లో పరిగి సబ్‌డివిజన్ “షీ” టీం ఇంచార్జ్ నర్సిములు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపల్ సునీల్‌కుమార్ సమక్షంలో విద్యార్థులకు పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్ 100, “షీ” టీమ్ హెల్ప్‌లైన్ 181, సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. అలాగే బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం,బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం అలాగే సైబర్ నేరాలపై (హెల్ప్‌లైన్ నం. 1930) సమగ్ర అవగాహన కల్పించారు.విద్యార్థులు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, “షీ” టీమ్ సభ్యులు సావిత్రి, శోభ ఉన్నారు.

## ప్రతిభ చాటిన ట్రైనర్‌కు ఘన సత్కారం






**హైదరాబాద్, ఫిబ్రవరి 22:** ఈ నెల 20, 21, 22 తేదీలలో నిర్వహించిన “మెగా ఇంపాక్ట్ 2026” కార్యక్రమం ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు సాగిన ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న ట్రైనర్లు, మోటివేషనల్ స్పీకర్లు తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు డా. గంప నాగేశ్వరరావు పాల్గొన్న వారిని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ట్రైనింగ్ రంగంలో విశేష కృషి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.ఇందులో భాగంగా ఇంపాక్ట్ బంధం టీమ్ తరుపున ప్రవీణ్ సర్టిఫికెట్ అందుకున్నారు.ఆయనకు సర్టిఫైడ్ ట్రైనర్ సర్టిఫికేట్‌తో పాటు బెస్ట్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్ అవార్డును సంద్ర సుధీర్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ.. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

# ఇంటర్ మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు.

● నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.



**నారాయణపేట,ఫిబ్రవరి,24(సమయం న్యూస్)** : ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకు ండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు. ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో, పరీక్ష కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉంచకూడదని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బి.యన్ .యస్.యస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, సెంటర్ల వద్ద గుంపులుగా తిరగడం నిషేధమని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని తెలిపారు .ఈ సందర్భంగా పోలీసు అధికారులు తమ తమ పరిధిలోని ప్రతి పరీక్ష కేంద్రాన్ని ప్రత్యేకంగా సందర్శించి, బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్ష కేంద్రాల వద్ద పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పరీక్ష సమయాల్లో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది ఎగ్జామ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలని, ప్రశ్నాపత్రాలు పోలీస్ స్టేషన్ నుండి పరీక్ష కేంద్రాలకు మరియు పరీక్ష అనంతరం డిటిఓ (ఋూ) కు తరలించే వరకు ఎస్కార్ట్ ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల లోపల ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# కుల వివక్ష దాడిలో పసి పాపం మృతి దారుణం

● నిందితులను కఠినంగా శిక్షించాలి

● ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

● బీసీ సేన షాబాద్ మండల అధ్యక్షుడు, దామరపల్లి డిప్యూటీ సర్పంచ్ దయాకర్ చారి డిమాండ్



**చేవెళ్ల,ఫిబ్రవరి 24 :(సమయం న్యూస్)** : నాగర్ కర్నూలు జిల్లాలోని కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో కులవివక్షతో నిరుపేద రజక కుటుంబం పై జరిగిన దాడిలో రెండు నెలల పసిపాప ప్రాణాలు కోల్పోవడం అత్యంత దారుణమని షాబాద్ మండల బీసీ సేన అధ్యక్షులు దామరపల్లి డిప్యూటీ సర్పంచ్ దయాకర్ చారి మండిపడ్డారు. విషయం తెలుసుకున్న దయాకర్ చారి మంగళవారం ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. మల్లన్న స్వామి జాతరకు వెళ్లి న రజక దంపతులు గణేష్ మౌనిక తమ రెండు నెలల పసిబిడ్డతో పాటు తల్లి చెల్లి తో కలిసి దైవదర్శనానికి వెళ్లగా అక్కడ కులవివక్షతో కొందరు వ్యక్తులు వారిపై దాడికి దిగారు ఈ అమానుషమైన దా డిలో తీవ్ర గాయాల పాలైన రెండు నెలల పసిపాప ప్రాణాలు కోల్పోయింది .ఈ సందర్భంగా దయాకర్ చారి మాట్లాడుతూ ఇప్పుడు మనము నివసిస్తున్నటువంటి కంప్యూటర్ యుగంలో కూడా ఇటువంటి కుల వివక్ష ఇంకా కొనసాగుతున్నాయి అంటే ఇంతకంటే దారుణం ఇంకోటి లేదన్నారు. నిరుపేద కుటుంబం పై అగ్రకులస్తులు చేసిన దాడిలో పసిబిడ్డ ప్రాణాలు పోవడానికి కారణమైన నిందితులపై వెంటనే విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి కుల వివక్ష అంతం కావాలని దేవాలయాల్లో ఇలాంటి వివక్షపూరిత దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి అండగా మరణించిన పసిపాప కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే భారీ పరిహారం అందించి ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో క్రింది ఆదేశాలు అమల్లో ఉంటాయి

● కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్



**కుల్కచర్ల మండలం, ఫిబ్రవరి,24(సమయం న్యూస్)** : కుల్కచర్ల మండలంలో జరుగుచున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు -- ఫిబ్రవరి/మార్చి 2026 సందర్భంగా, 25.02 .2026 నుండి పరీక్షలు నిర్వహించబడనున్నందున, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతా లలో క్రింది ఆదేశాలు అమల్లో ఉంటాయి. 1. పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని జిరాక్స్ (శవతీశీఇ) దుకాణాలు పరీక్ష సమయాల్లో మూసివే యబడాలి. 2. పరీక్షల కాలంలో పరీక్షా కేంద్రాల వద్ద భారతీయ దండన ప్రక్రియ చట్టం (జతీూజ) సెక్షన్ 144 అమల్లో ఉంటుంది. అనవసరంగా గుంపులుగా చేరడం, శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు పూర్తిగా నిషేధించబడినవి. 3. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం నిషేధం. 4. విద్యార్థులు పరీక్షా షెడ్యూల్ ప్రకారం సమయానికి ముందుగానే హాజరు కావాలి. ఆలస్యంగా రావడం వల్ల ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. 5. విద్యార్థులు ఎలాంటి ఆందోళన, ఆతురత లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. భయపడకుండా, నిశ్చింతగా పరీక్షలను ఎదుర్కోవాలి.పరీక్షల సమయంలో శాంతి భద్రతలు కాపాడుటకు కుల్కచర్ల పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రజలు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పోలీస్ శాఖకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి.

## తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా యాలాల మహేశ్వర్ రెడ్డి నియామకం



**హైదరాబాద్, ఫిబ్రవరి 24సమయం న్యూస్** :తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్‌గా యాలాల మహేశ్వర్ రెడ్డిని నియమించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ కారులను ఐక్యం చేస్తూ వారి ఆత్మగౌరవం మరియు సంక్షేమం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఉద్యమ కారుల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించారు.ఈ నియామకం తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగినట్లు వెల్లడించారు.

# మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కలెక్టర్

- టార్గెట్..ఆరోగ్య జనగాం
- 30 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికి స్క్రినింగ్
- మధుమేహం, అధిక రక్తపోటు బారిన పడకుండా చర్యలు
- యుక్త వయసు లోనే అడ్డుకట్ట
- సమన్వయముగా పని చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం ఫిబ్రవరి24( సమయం న్యూస్)** : ఆరోగ్య జనగాం కార్యక్రమాన్ని ఆదర్శ ప్రజారోగ్య కార్యక్రమంగా తీర్చిదిద్ది, జనగాం జిల్లాను మధుమేహం, అధిక రక్తపోటు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కట్టుబడి ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, నిరోధక, ప్రోత్సాహక ఆరోగ్య సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించడం లక్ష్యంగా... జిల్లాలో తొలిసారిగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వినూత్న ఆరోగ్య కార్యక్రమం "ఆరోగ్య జనగాం" కి శ్రీకారం చుట్టారు ఈ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరెట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ను డి ఏం ఎచ్ ఓ తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. .వివిధ శాఖలు, స్థానిక సంస్థల సమన్వయంతో జిల్లాలో ప్రజల ఆరోగ్య స్థాయిని మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు కావడానికి వీూణూలు, సర్పంచ్‌ల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వారు సమన్వయంతో పనిచేసి గ్రామ స్థాయిలో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.30 సంవత్సరాల పై బడి ఉన్న ప్రతీ ఒక్కరిని హైపర్ టెన్షన్, దయాబెటీస్ స్క్రినింగ్ చేయాలనీ కలెక్టర్ తెలిపారు ముందస్తుగా వాటిని గుర్తించి... సరైన చికిత్స అందించడం ద్వారా భవిష్యత్ లో చాలా మందిని ఈ వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చున్నారు ఈరోజు ఈ కార్యక్రమ ప్రారంభం సందర్భంగా.. జిల్లా లోని అన్ని పీహెచ్సి ల వైద్య అధికారులకు స్క్రినింగ్ కి సంబందించిన అవగాహన కల్పించి అలాగే క్షేత్ర స్థాయి లో తీసుకోవాలిసిన చర్యలను తెలిపారు ఎంపీడీఓ లు, వైద్య తదితర శాఖల అధికారులు

మండల స్థాయి లో సమావేశాలను ఏర్పాట్లు చేసి... స్క్రినింగ్ సంబందించిన యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోని గ్రామాల వారీగా షెడ్యూల్ లను రూపొందించుకోవాలన్నారు ముందుగా ప్రతీ గ్రామం వారీగా రోజుకి 100 మంది చొప్పున స్క్రినింగ్ చేయాలనీ... ఆతరువాత మార్చ్ 2 నుండి ఏప్రిల్ 30 వరకు ఈ కార్యక్రమం ద్వారా ప్రెగ్నెంట్, యూత్ యుక్త వయస్సు ఉన్న వారికి స్క్రినింగ్ పూర్తి చేసి వారికి హెల్త్ కార్డు లను అందించాలన్నారు అంతే కాకుండ వారు ఎప్పటికి...మధుమేహం, అధిక రక్త పోటు బారిన పడకుండా...తీసుకోవలిసిన ఆహారం అలవాట్లను, యోగ లాంటి సాధనల మీద అవగాహన కల్పించాలన్నారు

ఈ ఓరియంటేషన్ సమావేశానికి ఙ=ఙూ వసంత , జిల్లా పంచాయతీ అధికారి నవీన్, జిల్లాలోని వైద్య అధికారులు, మీూవులు, పీహెచ్సీ సూపర్వైజర్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది మరియు ఇతర సంబంధిత అధికారులు హాజరయ్యారు.

# ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



**వికారాబాద్, ఫిబ్రవరి,24(సమయం న్యూస్)** : జిల్లాలో ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షలను సమర్థ వంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత అన్ని జిల్లాల కలెక్టర్లతో, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వికారాబాద్ కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ , అదనపు కలెక్టర్ సుదీర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రాజేశ్వరి, అడిషనల్ ఎస్ పి రాము నాయక్ , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీ.ఎస్ రామకృష్ణారావు సూచించారు.ప్రశ్నపత్రాల రవాణా నుండి పరీక్షా కేంద్రాలకు అవి చేరేవరకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్ కొరత లేకుండా, విద్యార్థులకు తగిన కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను సీఎస్ దృష్టికి తెచ్చారు.ఈ నెల (ఫిబ్రవరి) 25 నుండి మార్చి 18వ తేదీ వరకు కొనసాగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు మొత్తం 16400 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 28 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. మార్చి 14 నుండి ఏప్రిల్ 16వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో 13579 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరుకా నున్నారని,144 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, ఎలాంటి లోటుపాట్లకు తావులే కుండా పరీక్షల ను సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించామని అన్నారు. ప్రశ్నాపత్రాలను ఆయా రూట్ల వారీగా పోలీస్ ఎస్కార్ట్ మధ్య తీసుకెళ్లాలని సూచించామని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తూ, తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తు న్నామని, పరీక్షలు జరిగే సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచాలని ఆదేశించామ న్నారు.ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబా టులో ఉండేలా, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనెలా చర్యలు తీసుకున్నామని అన్నారు.పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి కనీసం ఒక గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని అవగాహన కల్పించామని అన్నారు.సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను పరీక్షా కేంద్రాల్లో అనుమతించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అన్ని శాఖల సమన్వయంతో ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలను విజయవంతం గా,ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఇంటర్ విద్యాధికారి శంకర్ నాయక్, డీఈఓ రేణుకా దేవి, డీపీఓ జయసుధ, ఆర్టిసి ఆర్.ఎం నమ్రత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా లో జరిగే పదవ తరగతి పరీక్షల ద నిర్వహణ లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండ

- సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సుపరింటేన్డేంట్ పూర్తి బాద్యత వహించాలి...
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.




**వికారాబాద్, ఫిబ్రవరి,24(సమయం న్యూస్)** : మంగళవారం ఐ డి ఓ సి సమావేశం హాలు నందు విద్యా శాఖ అధ్వర్యంలో చీఫ్ సుపరింటేన్డేంట్ మరియు మండల విద్యాదికారులకు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూజిల్లా లో జరిగే 10వ తరగతి పరీక్షల నిర్వహణ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.పదోవ తరగతి పరీక్షలు మార్చి14.03.2026 నుండి ప్రారంభం అవుతాయని,ఏప్రిల్ 16 వరకు పదోవ తరగతి పరీక్షలు జరుగుతాయని ,జిల్లా లో 69 పరీక్ష సెంటర్ లు ఏర్పాటు చేయడం జరుగిందని, ఉదయం 9.30 నుండి మద్యాహ్నం 12.30 గంటల వరకుపరీక్షలు ఉంటాయని, విద్యార్థులందరూ వారి వారి హాల్ టికెట్లు సరిచూసుకోవాల్సిందని , అదేవిధంగా విద్యార్థులందరూ పరీక్ష కేంద్రాలను ఒకరోజు ముందుగానే సందర్శించి, ప్రతిరోజు ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సిందిగా సూచించారు.విద్యార్థులు మరియు పరీక్షలను నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎలాంటి ఎలక్ట్రికల్ వస్తువులు మరియు సెల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లోను తీసుకు రాకూడదని సూచించారు.పరీక్ష కేంద్రంలో మరియు పరిసరాల్లో సెల్ ఫోన్ లు పూర్తిగా నిషేదించినట్లుగా తెలిపారు.పదవ తరగతి పరీక్షలకు మొత్తం 13579 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఎక్కడ కూడా చిన్న సమస్య రాకుండా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వెళ్లాలని, పరీక్షలకు సంబంధం లేని వ్యక్తులు ఎవరిని కూడా పరీక్ష హాలు లోకి అనుమతించరాదని, మాస్ కాపీయింగ్ కు అవకాశం ఇవ్వరాదని తెలిపారు.పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని ఆయన తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో ఫర్నిచర్, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు.పదవ తరగతి పరీక్షలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.సమావేశం లో డిఈఓ రేణుకాదేవి, రామ్ రెడ్డి, ఏ.సి జి.ఇ, మండల విద్యాదికారులు ,ప్రదానోపాద్యాయులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమయం
www.epaper.samayamdaily.net

# ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలి

- అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ జరగాలి
- నర్వ యాస్పరేషన్ బ్లాక్ లో విస్తృతంగా పర్యటించిన నీతి ఆయోగ్ డిప్యూటీ సెక్రటరీ/
- అడిషనల్ మిషన్ డైరెక్టర్ గౌరవ్ కటియార్.




**నర్వ మండలం, ఫిబ్రవరి,24(సమయం న్యూస్) :** ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచే దిశగా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలని నీతి ఆయోగ్ డిప్యూటీ సెక్రటరీ/ అడిషనల్ మిషన్ డైరెక్టర్ గౌరవ్ కటియార్ సూచించారు. నారాయణపేట జిల్లాకు వచ్చిన ఆయన మంగళవారం జిల్లాలోని నర్వ యాస్పరేషన్ బ్లాక్ మండలంలోని పెద్ద కడుమూరు,రాయికోడ్, పాతర్ చేడ్, నర్వ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం, పశు వైద్య శిబిరాలు, ఆరోగ్య కేంద్రాల్లో వసతులు, మహిళల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ముందుగా పెద్ద కడుమూరు గ్రామానికి చేరుకున్న గౌరవ్ కటియార్ పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.విద్యార్థులు చేస్తున్న యోగా ఆసనాలను తిలకించారు.పాఠశాలలో కొనసాగుతున్న డిజిటల్ క్లాస్ ను, ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ల్యాబ్ ను, ల్యాబ్ లో ఆధునాతన పరికరాలను ఆసక్తిగా పరిశీలించారు. ఏ ఎక్స్ ఎల్ బోధనా విధానాన్ని చూశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యా వివరాలను అడిగి వారికి అవసరమైన వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులలో పఠనాశక్తిని పెంచేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. పీఎం శ్రీ నిధుల మంజూరు, వినియోగం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని రాయికోడ్ గ్రామానికి చేరుకున్న గౌరవ్ కటియార్ అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో పిల్లల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు చెప్పిన చిన్న చిన్న గేయాలను విని వారిని అభినందించారు. ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, నీతి అయోగ్ రాష్ట్ర సమన్వయకర్త లోకేష్ తో కలిసి గ్రామానికి చెందిన గర్భిణీలకు చీర,గాజులు, పసుపు కుంకుమ పెట్టీ శ్రీమంతం చేసి, చిన్నారులకు అన్న ప్రాసన అక్షరాభ్యాసం చేయించారు. గ్రామానికి చెందిన ఫాతిమా బేగం నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇంటిని ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి పేరిట మంజూరు చేస్తున్న ఈ పథకంలో ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద చెల్లిస్తున్న వాటా కూడా ఉంది కదా అని హౌసింగ్ పీడీ శంకర్ ను ప్రశ్నించగా అవును అని పీడీ సమాధానమిచ్చారు. ఆ తర్వాత పాతర్ చేడ్ గ్రామంలో పశువులకు ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే శిబిరాన్ని కటియార్ సందర్శించి పశువులకు టీకాలు వేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం నర్వ మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ లో కొనసాగుతున్న అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కటియార్ అక్కడి వసతి సౌకర్యాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రానికి మరుగు దొడ్డి లేదని వెంటనే ఏర్పాటు చేయించాలని అధికారులకు సూచించారు. అయితే అంగన్ వాడీ కేంద్రం నిర్మాణం కోసం వేరే చోట స్థలం చూపించామని, కొత్త భవన నిర్మాణానికి అనుమతి అవసరమని గ్రామ ప్రజా ప్రతినిధులు కొందరు కోరారు. అందుకు కటియార్ సానుకూలంగా స్పందించారు. దశల వారీగా అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఆ తర్వాత ఆయన నర్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి నిరుపేదలకు అందిస్తున్న వైద్య సేవల గురించి విచారించారు. ఆస్పత్రిలోని ప్రసవ గదిని పరిశీలించి, నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతాయని, రోజుకు ఓ.పీ. ఎంత మంది, అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉన్నాయా ?. వైద్య సిబ్బందిని అందరూ ఉన్నారా ?.ఏమైనా ఖాళీలు ఉన్నాయా అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి సంబంధించిన అన్ని రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.అయితే ఆస్పత్రికి వచ్చిన నర్వ సర్పంచి హనుమంత్ రెడ్డి గౌరవ్ కటియార్ కు ఆస్పత్రి భవన పై కప్పు, ఒక గది పై కప్పు పెచ్చులూడిందని ఫిర్యాదు చేసి చూపించారు. దీనిపై కటియార్ స్పందిస్తూ.. తాత్కాలిక మరమ్మతులకు ఆస్కారం ఉంటే చేయించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. చివరగా ఆయన నర్వ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల మహిళా సమాఖ్య భవనంలో మండలానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న పాఠశాల యూనిఫాం కుట్టు కేంద్రాన్ని సందర్శించి మహిళలు కుడుతున్న స్కూల్ యూనిఫామ్స్ ను పరిశీలించారు. ఏడాది పొడవునా స్కూల్ యూనిఫామ్స్ కుడాతారా ?.అని ప్రశ్నించారు. కేవలం సీజన్ లోనే తాము యూనిఫామ్స్ కూడతామని, మిగతా సమయంలో పొలం పనులు, ఇతర ఉపాధి పనులు చేసుకుంటామని మహిళలు తెలిపారు. స్కూల్ యూనిఫామ్స్ తో పాటు వేరే ఎవరైనా ఏజెన్సీ బట్టలు కుట్టేందుకు మిమ్మల్ని సంప్రదించారా ?.అని ఆరా తీశారు. తాము స్కూల్ యూనిఫామ్స్ మాత్రమే కుడతామని, వేరే ఏం కుట్టడం లేదని తెలిపారు.ఈ విషయంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి మరీ వాళ్లకు స్కూల్ యూనిఫామ్స్ స్టిచింగ్ బాధ్యతలు అప్పగించి ఉపాధి కల్పిస్తుందని, ఈ సీజన్ లో ఒక్కో మహిళకు 5 వేల ఆదాయం వస్తుందని, సీజన్ తర్వాత మహిళలు ఇతర పనులతో ఉపాధి పొందుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, డీడబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, సిడిపివో సరోజ, ఎంఈవో రాంరెడ్డి, యాస్పరేషన్ బ్లాక్ సమన్వయ కర్త బాలాజీ, సూపర్ వైజర్ మానస,పెద్ద కడుమూరు, రాయికోడ్ సర్పంచులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



**బాన్సువాడ ఫిబ్రవరి 24 (సమయం న్యూస్) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ఆక్స్ఫర్డ్ స్కూల్ లో మంగళ వారం రోజు చిన్నారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కిడ్స్ మార్కెట్ అత్యంత విజయవంతంగా జరిగింది. విద్యార్థుల్లో సృజనాత్మకత, వ్యాపార దృక్పథం, ఆత్మవిశ్వాసం మరియు బాధ్యతాభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “విద్య అనేది పుస్తకాలకే పరిమితం కాకుండా జీవిత నైపుణ్యాలను కూడా నేర్పాలి. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమన్వయ భావన మరియు ఆర్థిక అవగాహన పెంచుతాయి” అని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యాన్ని మరియు ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య నరేష్ గారు మాట్లాడుతూ, పిల్లల సమగ్రాభివృద్ధి కోసం విద్యతో పాటు ప్రాయోగిక అనుభవాలు కూడా అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పిల్లల స్టాల్స్ వద్ద వస్తువులు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పద్మ, తేజస్వి, రేఖ, సౌభాగ్య, వీణ, సునీత, మౌనిక, మనీషా, సవిత, మానస తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో చిన్నారులు స్వయంగా స్టాల్స్ ఏర్పాటు చేసి, వివిధ హస్తకళలు, ఆహార పదార్థాలు మరియు సృజనాత్మక వస్తువులను ప్రదర్శించి అమ్మకాలు నిర్వహించారు.పిల్లలు కస్టమర్లతో మాట్లాడడం, ధర నిర్ణయించడం, లావాదేవీలు నిర్వహించడం వంటి అంశాల్లో చురుకుదనం ప్రదర్శించారు. ఇది వారికి భవిష్యత్తులో వ్యాపార దృక్పథం మరియు ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి దోహదపడుతుంది. కార్యక్రమం మొత్తం ఆనందభరిత వాతావరణంలో సాగి, తల్లిదండ్రులు మరియు అతిథుల ప్రశంసలు అందుకుంది.ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి బలమైన పునాది వేస్తాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది...స్తానిక దంత వైద్య నిపుణుడు అచ్చుకట్ల జీవన్,మాజీ కౌన్సిలర్ నందకిశోర్,మాజీ ఎంపీటీసీ సాగర్ షిండే ,పంతులు రాము, యండమూరి వర ప్రసాద్,ప్రచేతన్ తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# హెచ్ -- సిటీప్రాజెక్టు పనుల్లో వేగం పెంచండి

--ఎస్ ఆర్ డి పి ఎస్ ఎన్ డి పి అసంపూర్తి పనులను పూర్తిచేయండి.

-- కీలక ఇంజనీరింగ్ పనుల పై చేపట్టిన సమీక్ష సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్

**హైదరాబాద్, ఫిబ్రవరి24( సమయం న్యూస్) :** నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేసేందుకు చేపట్టినఎస్ఆర్ డీపీ,హెచ్ -- సిటీ పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో మంగళవారం కమిషనర్ ఆర్ వి కర్ణన్ నగరంలోని జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని జోన్ లలో చేపడుతున్న ఎస్ఎన్ డీపీ, హెచ్ -- సిటీ ప్రాజెక్టులు , స్ట్రాటజిక్ రోడ్డు డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (రా=ణూ) పనుల పురోగతి పై జోనల్ కమిషనర్ లు , ప్రాజెక్ట్స్ ఇంజనీర్ లు, ప్లానింగ్ , ఇరిగేషన్,భూ సేకరణ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఇంజనీరింగ్ అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఒక్కో ప్రాజెక్ట్ పురోగతిని కమిషనర్ కు వివరించారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ప్రతిబంధకాలు, క్షేత్ర స్థాయి సవాళ్లు, పెండింగ్ పనులు, అందుకు గల కారణాలను తెలిపారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల వేగంగా పూర్తికి కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ప్రాజెక్ట్ ల పూర్తికి నిధుల కొరత లేదన్నారు.యుటిలిటీ షిఫ్టింగ్, పెండింగ్ భూ సేకరణ యుద్ద ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఇష్యూస్ ఏమైనా ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉంటే తనకు తెలియజేస్తే వెంటనే క్లియర్ చేస్తానని చెప్పారు. హెచ్ -- సిటీ , ఎస్ఆర్ డీపీ, ఎస్ఎన్ డీపీ కింద చేపట్టిన పనులపై ఫోకస్ పెట్టి వేగంగా జరిగేలా చూడాలన్నారు. ప్రగతిలో ఉన్నముసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి, నల్గొండ ఎక్స్ రోడ్డు ఫ్లై ఓవర్ పనులను మిషన్ మోడ్ లో చేస్తూ జూన్ 2 వ తేదీ కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కే బి ఆర్ పార్క్ ప్రాజెక్ట్ పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు.పనులు జరిగే ప్రదేశాలలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ పోలీస్ లతో ప్లాన్ చేసుకోవాలని చెప్పారు.జోనల్ కమిషనర్ లు అనురాగ్ జయంతి , జి. ముకుందా రెడ్డిచీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్,ప్రత్యేక ఉప కలెక్టర్ రమాదేవి, రాజు,జుజు,ణజుజు లు సమావేశంలో పాల్గొన్నారు.

# వారం రోజుల్లో 80 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలి.

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.



**నారాయణపేట,ఫిబ్రవరి, 24(సమయం న్యూస్) :** జిల్లాలోని అన్ని గ్రామాలలో ప్రతీ ఇంటికి వెళ్ళి ఖచ్చితమైన ఓటరు గుర్తింపుతో ప్రోసిడింగ్ మ్యాపింగ్, ఎలక్ట్ర రోల్ మ్యాపింగ్ చేపట్టాలని వారం రోజుల్లో ఈ ప్రక్రియను 80 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారని ఆమె తెలిపారు.ఎస్ ఐ ఆర్ ప్రారంభమైతే నేరుగా డిల్లీ నుంచి బృందం వచ్చి తనిఖీ చేస్తుందని, అప్పుడు ఏమైనా పొరపాటు ఉందని తేలితే తీవ్ర పరిణామాలు ఉంటాయని, అందుకే బి ఎల్ వో లు సమయం తీసుకుని ఇల్లిల్లు తిరిగి మ్యాపింగ్ చేయాలన్నారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మంగళ వారం జిల్లాలోని దామరగిద్ద, ధన్వాడ, మరికల్,మక్తల్, మాగనూరు, కృష్ణ,ఉట్కూర్, నర్వ, నారాయణ పేట మండలాల తహసీల్దార్లు, ఏఈఆర్ వోలతో ఎస్ ఐ ఆర్ పై జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలిసి కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఏ ఈ ఆర్ వో లు, బి ఎల్ వో లు, సూపర్ వైజర్లు ఇప్పుడే క్షేత్రస్థాయిలో మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎక్కువ సమయం ఉండదని తెలిపారు. నోటిఫికేషన్ వచ్చాక ఒత్తిడి పడకుండా ఇప్పుడే ఎవరి పరిధిలో వారు పని చేసుకుంటే ఎస్ ఐ ఆర్ చేసే సమ యంలో పని చాలా సులువు అవుతుందన్నారు. అయితే తహాసిల్దారులు విధిగా పర్యవేక్షణ చేయాలని, ప్రస్తుతం తహసిల్దార్ కార్యాలయాల్లోనే మ్యాపింగ్ పని కొనసా గుతోందని తర్వాత విస్తరించే అవకాశం ఉందన్నారు. బిఎల్ఓ లకు ఆదేశాలిచ్చి ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయిం చాలన్నారు. మ్యాపింగ్ సమయంలో పొరపాటు జరగ కుండా ఓటరు నిజమేనని నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. వలస వెళ్లిన ఓటర్ల వివరాలు కూడా సేకరించాలని, లేదంటే తీసే ఆస్కారం ఉందని,ఆ తర్వాత మళ్ళీ వాళ్లు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందనే విషయాన్ని మరచి పోవద్దు అని ఆమె తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియ లో సిద్ధి పేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాలలో 80 శాతం పూర్తి అయిందని, వారం రోజుల్లో మన జిల్లా కూడా 80 శాతం చేరుకోవాలని కలెక్టర్ తేల్చి చెప్పారు.ఈ సమీక్షలో ఆర్డిఓ రామచంద్రనాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారినిలు జయసుధ, రాణి దేవి, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ట్రాన్స్ మిషన్ మరియు ప్రాజెక్ట్స్ లో బదిలీలు చేపట్టని జలమండలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24సమయం న్యూస్ :** జలమండలిలో బదిలీల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ట్రాన్స్మిషన్ మరియు ప్రాజెక్ట్స్ విభాగం తప్ప అన్ని విభాగాలలో బదిలీల ప్రక్రియను యాజమాన్యం చేపడుతుంది. కౌన్సిలింగ్ నిర్వహించకుండానే డీజీఎంల బదిలీలు చేపట్టడంతో ఇప్పటికే బోర్డు అబాసు పాలయింది. రిటైర్మెంట్ కు దగ్గర ఉన్న వాళ్ళని కూడా వదిలిపెట్టకుండా బదిలీలు చేసిన ఘనత జలమండలికే దక్కింది. ఏ ఉద్యోగైన రిటైర్మెంట్ కు దగ్గర ఉంటే వారిని అక్కడ నుంచి దాదాపుగా కదపరు. కానీ రూల్స్ ను జలమండలి అధికారులు ఖచ్చితంగా పాటిస్తరు కాబట్టి వారిని కూడా బదిలీ చేశారు. మరి అవే రూల్స్ ట్రాన్స్మిషన్ మరియు ప్రాజెక్ట్స్ విభాగానికి ఎందుకు వర్తించవని అధికారులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. బోర్డు తీసుకునే నిర్ణయాలతో చాలా మంది ఉద్యోగులు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో సిజిఎం స్థాయిలో ఉన్న అధికారి పని ఒత్తిడిని తట్టుకోలేక మరణించడం జరిగింది. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయిన బదిలీ చేస్తే ఎక్కడైనా సరే పని చేయాల్సిందే.. కానీ తమకు ఒక రూల్ ట్రాన్స్మిషన్, ప్రాజెక్ట్స్ కి ఇంకోరూలు ఏ విధంగా ఉంటుందని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఎంత మంది ముఖ్యమంత్రులు మారిన ట్రాన్స్మిషన్ మరియు ప్రాజెక్ట్స్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు మాత్రం అక్కడ నుండి మారరు అనేది ఇప్పుడు బోర్డులో హాట్ టాపిక్ అయింది. ఇప్పటికైనా జలమండలి అధికారులు కళ్ళు తెరిచి ట్రాన్స్మిషన్ మరియు ప్రాజెక్ట్స్ లో బదిలీలను చేపట్టాలని, అదేవిధంగా మేనేజర్ బదిలీలలో కౌన్సిలింగ్ విధానాన్ని పాటించాలని ఇంజనీరింగ్ అధికారులు కోరుతున్నారు. వేసవి ప్రారంభమైన ఈ సమయంలో బదిలీలు చేపట్టడం వల్ల నగరవాసులు నీటి సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇంజనీరింగ్ అధికారులు వాపోతున్నారు

# పొగుట్టుకున్న సెల్ ఫోన్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా కనుగొని బాధితునికి అందజేత

- ఎవరివైన ఫోన్లు మిస్ అయితే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయండి
- కుల్కచర్ల ఎస్సై రమేష్..




**కుల్కచర్ల మండలం, ఫిబ్రవరి,24(సమయం న్యూస్) :** పరిగి నియోజకవర్గం కులక్చర్ల గ్రామానికి చెందిన కటన్ పల్లి మైపాల్ తమ ( మొబైల్ ఫోన్) పోయినట్లు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సెల్ ఫోన్ ను (సీఈఐఆర్) పోర్టల్ సహాయంతో ట్రాక్ చేసి బాదితునికి పీసీ రాఘవేంద్ర,సాయిరాం తో కలిసి పోలీస్ స్టేషన్ లో అందించినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.ఫోన్ అందుకున్న బాధితుడు ఎస్సై మరియు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.అనంతరం ఎస్సై రమేష్ మాట్లాడుతూ...మొబైల్ ఫోన్ తప్పిపోయినప్పుడు సకాలంలో పోలీస్ స్టేషన్లో సమాచారం ఇస్తే ఫిర్యాదులకు న్యాయం జరుగుతుందని ప్రజలకు ఎస్సై రమేష్ తెలిపారు.

# కుమ్మెర బాధితులకు న్యాయం చేయాలి

వీరనారీమణుల ఆశయ సాధన సమితి



**ఖమ్మం, ఫిబ్రవరి 24 : ( సమయం న్యూస్ ) :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామం మల్లన్న జాతరలో రజకులపై దాడి చేసి రెండు నెలల చిన్నారి పసిపాపను హత్య చేసిన టువంటి రెడ్డి కులస్తులపై మర్డర్ కేసు నమోదు చేసి , తక్షణమే అరెస్ట్ చేయాలని వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమే మాట్లాడుతూ భాదిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రెసియా,ఒక ప్రభుత్వం ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, వారికి పోలీసు రక్షణ కల్పించి న్యాయం చేయాలనీ ప్రభుత్వాన్ని సూచించారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటర్, ఎస్ ఎస్ సి పరీక్షలు హాజరయ్యే విద్యార్థులకు విషెస్ చెప్పిన జిల్లా కలెక్టర్.రాహుల్ శర్మ.

● పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వెల్లడి.

**భూపాల పల్లి ఫిబ్రవరి24( సమయం న్యూస్) :** 25వ తేదీ బుధవారం నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అల్ ది బెస్ట్ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై తమ ప్రతిభను చాటాలని సూచించారు.పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు ఒక ముఖ్యమైన దశ అని పేర్కొన్నారు. క్రమశిక్షణ, సమయపాలనతో పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్ వెంట తీసుకెళ్లాలని తెలిపారు.జిల్లా యంత్రాంగం తరఫున పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి వత్తిడికి గురికావొద్దని, తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక ధైర్యం కల్పించి, ఒత్తిడి లేకుండా పరీక్షలకు పంపాలని సూచించారు.విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.ఏదేని సలహాలు, సందేహాలకు అలాగే పరీక్షా కేంద్రాల సమాచారం కొరకు కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన కంట్రోలు రూము నంబర్లు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 9705299368, మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేసే 8008878060 నంబరుకు కాల్ చేయాలని తెలిపారు.

## జోగినివ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

● ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో జాతరలో అవగాహన క్యాంప్





**నారాయణపేట, ఫిబ్రవరి,24(సమయం న్యూస్) :** లింగంపల్లి ఎల్లమ్మ జాతర లో (నారాయణపేట మండల ఓఎంఐఎఫ్( ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్) అధ్వర్యంలోజాతరలో అవేర్నెస్ క్యాంప్ ఏర్పాటు చేసిన ఓఎంఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్. హాజమ్మా మాట్లాడుతూ జాతరలో ప్రజలకు ముదానమ్మకలు జోగిని వ్యవస్థ బాల్య వివాహాలు మానవ అక్రమ రవాణా మహిళల పై జరుగుతున్న అత్యాచారాల కు వ్యతిరేకంగా ఉద్యమించాలని ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను గౌరవించాలని చదివించాలని దేవత పేరుతో జోగిని బసివిని దేవదాసీ లుగా మారిస్తే చట్ట రీత్యా. నేరం 1986 జోగిని. చట్టం ప్రకారం శిక్షించడం జరుగుతుందని కావున ప్రతి పౌరుడు చట్టాల గురించి తెలుసుకోవాలని ముదానమ్మకల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మైకు ద్వారా ర్యాలి చేస్తు జాతరలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఓఎంఐఎఫ్ మండల కోఆర్డినేటర్ అశమ్మ. కె నారాయణ ఆరోగ్య కార్యకర్తలు జోగిని కమిటీ మెంబెర్స్ పాల్గొన్నారు.

## కొడంగల్ బస్టాండ్ లో దొంగతనం

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం ఎస్సై సత్యనారాయణ



**కొడంగల్ మున్సిపల్, ఫిబ్రవరి,24(సమయం న్యూస్)** : కొడంగల్ పోలీస్ స్టేషన్ ఎస్సై జి.వి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం తేదీ 22.2. 2026(ఆదివారం) నాడు మధ్యానం 1:30 నిమిషాలకు తాండూరు పట్టణం లోని ఇందిరానగర్ కు చెందిన సూరక.మల్లేశ్వరి భర్త బాలకృష్ణయ్య అనే మహిళ తుంకిమెట్ల నుండి కొడంగల్ బస్టాండ్ కు వచ్చి తాండూర్ కు వెళ్ళడానికి కొడంగల్ బస్టాండ్ లో ఉండగా తాండూర్ బస్టాండ్ లో పబ్లిక్ ఎక్కువ ఉండటం వలన దొంగతనలు జరుగుతాయి అనుకోని తన మెడలో ఉన్నటువంటి మూడున్నర తులాల బం గారు నల్లపూసల దండని మెడలో నుండి తీసి తన పర్సులో పెట్టుకొని అట్టి పర్సు బ్యాగులో పెట్టకొని తాండూర్ బసు ఎక్కిన తర్వాత టికెట్ కోసం తన ఆధార్ కార్డు కోసం బ్యాగును చూడగా బ్యాగ్ లో పెట్టిన పర్సు కనిపించలేదు.తన పర్సు లోనీ మూడున్నర తులాల బంగారు నల్లపూసల దండ మరియు 700 రూపాయలు దొంగతనం చేయడం జరిగిందని పోలీస్ లకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఆటి ఫిర్యాదు పైన కొడంగల్ పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

## సీఎం కప్ విజయాలు జిల్లాకు గర్వకారణం

-- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం ఫిబ్రవరి24( సమయం న్యూస్).:** రాష్ట్ర యువజన సర్వీసులు మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు సాధించిన విజయాలు జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు . రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీలలో జిల్లా నుండి పాల్గొన్న క్రీడాకారులు వివిధ క్రీడా విభాగాలలో ప్రతిభ కనబరచి మొత్తం 54 పతకాలు సాధించడం విశేషమని అన్నారు .ఈ సందర్భంగా మంగళవారం ఐడీఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పతక విజేతలను అభినందించి, వారి కృషిని ప్రశంసించారు. క్రీడాకారులు సాధించిన 15 బంగారు, 19 వెండి, 20 కాంస్య పతకాలు జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని తెలిపారు. ముఖ్యంగా అథ్లెటిక్స్ విభాగంలోనే 31 పతకాలు సాధించడం జిల్లాలో క్రీడా అభివృద్ధి దిశగా సానుకూల పరిణామమని తెలిపారు .గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన యువ క్రీడాకారులు కూడా సమానంగా ప్రతిభ చాటుకోవడం అభినందనీయమని, క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందుతాయని కలెక్టర్ అన్నారు . క్రీడలు విద్యతో పాటు సమాన ప్రాధాన్యత పొందాలని, పాఠశాల స్థాయిలోనే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు.క్రీడాకారుల విజయాలలో కోచ్‌లు, శిక్షకులు, పాఠశాలల ప్రిన్సిపాళ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారుల సహకారం ప్రశంసనీయమని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా జిల్లా క్రీడాకారులు రాణించేలా అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి యం. పరంధామ రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహిధర్, కొమరారం వెంకటనారాయణ (ఏఎస్‌ఓ, ట్రైబల్ వెల్ఫేర్), బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ మట్టపర్తి రమేష్, టైక్వాండో సెక్రటరీ రమేష్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, మంజిలాల్ (పీడీ), నాగలక్ష్మి (పీడీ), చైతన్య (పీడీ), వాసు, నాగేందర్, నాగరాజు, మాలికార్జున్, గిరిప్రసాద్, కావేటి రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# భూదాన భూమిలో పేదల గుడిసెల తొలగింపు

● జెసిబిలుఫైర్ ఇంజన్లతో వందలాది పోలీసుల మొహరింపు
● కర్రలు కారంతో బాధితులప్రతిఘటన
● బి ఆర్ ఎస్ నాయకుల నిరసన
● మీడియాకునిషేధం




**ఖమ్మం , ఫిబ్రవరి 24 : ( సమయం న్యూస్ ) :** జిల్లా కలెక్టర్ కార్యాలయం వెనుకాల ఖమ్మం అర్బన్ మండల పరిధిలో గల వెలుగుమట్ల పంచాయతీలో భాగంగా ఉన్న భూదాన్ ( వినోబా నగర్ ) భూములలో 2013లో సుమారు 600 మంది పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం జెసిబిలు , ఫైర్ ఇంజన్లతో వందలాది మంది పోలీసుల మో హరింపుల మధ్య పేదల ఇళ్ల కూల్చివేతకు శ్రీకారం చుట్టిన క్రమంలో బాధితులు ముఖ్యంగా మహిళలు కర్రలు కారం పట్టుకొని ప్రతిఘటించిన ఉదంతం తీవ్ర ఉదిరిక్త పరిస్థితుల ను సృష్టించగా విషయం తెలుసుకున్న బీ ఆర్ ఎస్ నాయకులు తీవ్ర నిరసన ప్రకటించారు. వారిని అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఇదే సమయంలో ఆ ప్రాంతంలో మీడియా రాకుండా నిషేధం విధించారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ , ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు తాత మధు నిరసన కార్యక్రమంలో పాల్గొని , ఈ చర్యను ఖండించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ , రాజ్యసభ సభ్యులు రవిచంద్ర లు పేదల గుడిసెల కూల్చి వేతలపై ఆగ్రహం ప్రకటించారు. నాలుగు జిల్లాల నుండపెద్ద ఎత్తున పోలీస్ బలగాలను మోహరించడం , తెల్లవారుజామున ఇళ్ల కూల్చివేతకు ప్రయత్నించడం ఉద్రిక్తపరిస్థితులకు దారితీసింది. ఈ విషయం ఖమ్మం నగరం నలుమూలల వ్యాపించడంతో సంచలనంకలిగించింది. మీడియాకు నిషేధం విధించడంతో మీడియా వ్యక్తులువాగ్వదానికి దిగారు. హైదరాబాదు నుండి ఖమ్మం కు బయలుదేరిన పాత్రికేయులను సూర్యాపేటలో నిర్బంధించడం విశేషం.ఇది నిరంకుశ చర్య అంటూ ఒక ప్రకటనలో ముస్లిం లీగ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ . బాజీ బాబా ఖండించారు. ఇదిలా ఉండగా అకస్మాత్తుగా తెల్లవారుజామున గుడిసెల కూల్చివేత దారుణం , తాము ఎటు పోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఊపిరి పీల్చుకునే సమయం కూడా ఇవ్వకుండా ఇలాంటి అమానుష చర్య చేపట్టడం మంచిది కాదన్నారు. ఈరోజు సాయంత్రం దీనిపై అధికారులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు.

**తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగు మట్ల భూములు స్వాధీనం ;**
**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగుమట్ల భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెలుగు మట్ల భూదాన్ భూములలో అక్రమ కట్టడాల తొలగింపుపై లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ప్రసాద రావుతో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 1953 లో కలవల రాజా రామారావు సర్వే నెంబర్ 147, 148,149 లో 31 ఎకరాల 7 గుంటల భూమి భూదాన్ ఉద్యమంలో దానం చేశారని తెలిపారు. భూ దాన్ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గమనించిన ఖమ్మం అర్బన్ తహసిల్దార్ 2019 లో ఆక్రమణలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారని తెలిపారు.ఖమ్మం అర్బన్ తహసిల్దార్ జారీ చేసిన నోటీసులను హైకోర్టులో చాలెంజ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారని, హైకోర్టు తహసిల్దార్ కు భూదాన్ భూముల అంశంలో జ్యూరిస్డిక్షన్ సరిపోదని తెలుపుతూ తహసిల్దార్ ఆర్డర్ పై స్టే ఇస్తూ పిటిషన్ దారులు ఎట్టి పరిస్థితుల్లో కూడా భూదాన్ భూమి స్వభావాన్ని మార్చడానికి వీలులేదని తెలుపుతూ తీర్పు ఇచ్చిందని తెలిపారు.

కొర్లపాటి పరమేశ్వరి మరో 9 మంది పిటిషన్ దారులు కలిసి 2023 లో భూదాన్ భూములలో నిర్మించిన నిర్మాణాలను తొలగించకుండా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారని, దీనిపై హైకోర్టు స్పందిస్తూ కోర్టుకు సమర్పించిన పట్టా వివరాలు సరిగ్గా లేవని, భూదాన్ భూములలో పేదలు ఇండ్లు నిర్మించుకున్నట్లు దరఖాస్తు సమర్పించారని, పిటిషన్ దారులకు సంబంధించిన నిర్మాణాలను తొలగించవద్దని, నిర్మాణాలు లేకుండా మిగిలి ఉన్న భూమిలో ఎటువంటి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని స్టేటస్ కో జారీ చేసిందని అదనపు కలెక్టర్ తెలిపారు.తెలంగాణ భూదాన్ యజ్నా బోర్డు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టిందని, జనవరి 17, 2026 నాడు సంబంధిత పిటిషన్ దారులకు ఎటువంటి కేటాయింపులు చేయలేదని, 5 ఎకరాలు కేజీబీవీ పాఠశాలకు, 5 ఎకరాలు మోడల్ స్కూల్ కోసం మాత్రమే కేటాయింపులు చేసినట్లు తేల్చిందని అన్నారు.భూదాన్ భూములలో నివసిస్తున్న 308 ఆక్రమణదారులకు వెంటనే ఖాళీ చేయాలని జనవరి 17, 2026 న తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు నోటీసులు జారీ చేసిందని అన్నారు. వెలుగుమట్లలో కొంతమంది ఆక్రమణదారులు 2014 లో తమకు అలాట్మెంట్ వచ్చినట్లు కాగితాలు చూపిస్తున్నారని, రికార్డుల పరిశీలనలో ఎటువంటి అలాట్మెంట్ చేయలేదని తేలిందని తెలిపారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఖమ్మం జిల్లా కలెక్టర్ కు సర్వే నెంబర్ 147, 148, 149 లో 2023లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు రిట్ పిటిషనర్ ఆవుల శిరీష సంబంధించిన నిర్మాణాలు మినహాయించి మిగిలిన భూములు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పోలీస్ అధికారుల సహాయంతో వెలుగుమట్ల భూదాన్ భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం, హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేసిన వారి నిర్మాణాలు మినహాయించి మిగిలిన అక్రమ నిర్మాణాలను తొలగింపు చేశామని అన్నారు.

వెలుగు మట్ల భూదాన్ భూములలో ఎవరికి ఎటువంటి అలాట్మెంట్ ప్రభుత్వం చేయలేదని , ప్రభుత్వం ఏకపక్షంగా పేదల ఇండ్ల నిర్మాణాలు కూల్చి వేస్తున్నారని సామాజిక మాధ్యమాలలో వస్తున్న వార్తలలో వాస్తవం లేదని, పలు మార్లు రికార్డులు పరిశీలించి విచారణ చేసిన తర్వాత తెలంగాణ భూదాన్ బోర్డు ఆదేశాల మేరకు నేడు ఆక్రమణల తొలగింపు చేపట్టామని అన్నారు.

జనవరి 17, 2026 నాడు తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆక్రమణదారులు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిందని, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోమని తెలిపినందున, తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగుమట్ల భూ దాన్ భూములు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడానికి నేడు చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు.

అట్టి భూములలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాల నిర్మాణానికి సంబంధించి కేటాయించిన 10 ఎకరాలు కాకుండా ఎటువంటి కేటాయింపులు చేయలేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనం మాత్రమే చేసుకుందని, ఈ భూమి భవిష్యత్తులో ప్రజా ఉపయోగకరమైన కార్యక్రమాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగించడం జరుగుతుందని అన్నారు. సామాజిక మాధ్యమాలలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం నిరాశ్రయులైన వారికి కమ్మవారి సంఘంలో తాత్కాలిక వసతి ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ అన్నారు. భూదాన్ భూముల ఆక్రమణదారుల సామాగ్రి భద్రంగా అంబేద్కర్ భవనంలో స్టోర్ చేశామని, సంబంధిత ప్రజలు ఎక్కడికి ఆ సామాగ్రి తరలించాలంటే అక్కడికి తరలించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ప్రసాద రావు మాట్లాడుతూ భూ దాన్ భూముల కేటాయింపు సంబంధించి ప్రజల నుంచి కొంతమంది అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ పాత్రికేయులకు ఉన్న పలు సందేహాలకు సమాధానాలు తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

## జీవితంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే సులభంగా లక్ష్యాలను సాధించవచ్చు

● ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి
● ఎస్పీ రోహిత్ రాజు
కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో
● విద్యార్థులకు ఏర్పాటు చేసిన Arrive-Alive అవగాహనా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ



**కొత్తగూడెం ఫిబ్రవరి24( సమయం న్యూస్).** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి,ప్రజలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమమే ఀాతీతీఱఙవ-ాశ్రీఱఙవ-2026 అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఀాతీతీఱఙవ-ాశ్రీఱఙవ ఝఎజూఝఱస్త్రఅ-2026 రెండవ విడుతలో భాగంగా మంగళవారం నాడు కొత్తగూడెం క్లబ్ నందు విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించారు.కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీసులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.సుమారుగా 3000 మంది విద్యార్థిని,విద్యార్థులు వివిధ కళాశాలలు,పాఠశాలల నుండి హాజరయ్యారు.ముందుగా మిమిక్రీ కళాకారుడైన రమేష్ విద్యార్థులను తనదైన శైలిలో ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు.రోడ్డుపై విధులలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా,లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ,నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించే విధంగా సివిక్ సెన్స్ ను కలిగి ఉండాలని కోరారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి తమ ప్రాణ భద్రతతో పాటు,ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు.విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ తమ తల్లీదండ్రుల ఆశయాలకు తగ్గట్టుగా నడుచుకుంటూ మంచిగా చదువుకుని క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని అకాక్షించారు.అనంతరం సైబర్ నేరాలపై ఎస్పీ అవగాహన కల్పించారు.అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని తెలిపారు.చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు మారిన పడుతున్నారని తెలిపారు.ఓటీపి,హనీ ట్రాప్,ఆన్లైన్ ట్రేడింగ్,సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు.

**గంజాయి సేవిస్తూ పట్టుబడితే జైలుకే...** ప్రభుత్వ నిషేధిత గంజాయిని ఎవరైనా సరఫరా చేస్తున్నట్లుగానీ,సేవిస్తున్నట్లు గానీ తెలిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. చాలామంది యువత గంజాయి మత్తుకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా గంజాయి సేవిస్తూ పోలీసులు పట్టుబడితే కేసు నమోదు చేయడమే కాకుండా జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు.అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని కార్యక్రమంలో పాల్గొన్నారు ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వన్టౌన్ సిఐ కరుణాకర్,3 టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి,ఎస్సైలు రమణారెడ్డి,ప్రవీణ్,రమాదేవి,విజయ,రాకేష్,విజయసింహారెడ్డి,ఉమ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సెమీస్‌లో ఇంగ్లాండ్


## టీ20 వరల్డ్ కప్ సూపర్-8లో పాకిస్తాన్‌పై ఇంగ్లాండ్ ఉత్కంఠ విజయం

**శ్రీలంకలోని పల్లెకెలె వేదికగా మంగళవారం (ఫిబ్రవరి 24) జరిగిన ఐసీసీ టీ20 వరల్డ్ కప్ సూపర్-8 మ్యాచ్‌లో పాకిస్తాన్‌కు పరాభవం ఎదురైంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో ఇంగ్లాండ్ రెండు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో ఇంగ్లాండ్ జట్టు నేరుగా సెమీఫైనల్స్‌లో అడుగుపెట్టిన తొలి జట్టుగా రికార్డు సృష్టించింది. ఛేదనలో ఆరంభంలోనే తడబడినప్పటికీ, ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ అజేయ సెంచరీతో చెలరేగి జట్టు గెలుపునకు ఒంటిచేత్తో మార్గం సుగమం చేశాడు.**

### పాకిస్తాన్‌కు తప్పని నిరాశ



**అద్భుత సెంచరీతో కదం తొక్కిన ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్**



**రెండు వికెట్ల తేడాతో గెలిచి సెమీ ఫైనల్‌లో అడుగు పెట్టిన తొలి జట్టుగా రికార్డు**

**సెమీస్ దారిని సంక్లిష్టం చేసుకున్న పాకిస్తాన్**



**పల్లెకెలె, ఫిబ్రవరి 25:** టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ నిర్ణీత ఇరవై ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి నూట అరవై నాలుగు (164) పరుగులు చేసింది. ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ కేవలం నలభై ఐదు బంతుల్లో అరవై మూడు పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. స్టార్ ఆటగాళ్లు బాబర్ ఆజం (25), ఫఖర్ జమాన్ (25) కాసేపు క్రీజులో నిలిచారు. చివర్లో షాదాబ్ ఖాన్ కేవలం 11 బంతుల్లో 23 పరుగులు చేసి ధాటిగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగెత్తింది. ఇంగ్లాండ్ బౌలర్లలో లియామ్ డాసన్ మూడు వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్, జేమీ ఓవర్టన్ తలా రెండు వికెట్లు పడగొట్టి పాక్ భారీ స్కోరు సాధించకుండా కట్టడి చేశారు.

### కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన బ్రూక్

లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ జట్టుకు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. పాక్ పేసర్ షాహీన్ అఫ్రిది (4/30) తన పదునైన బౌలింగ్‌తో ఇంగ్లాండ్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. యాభై ఎనిమిది పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన దశలో కెప్టెన్ హ్యారీ బ్రూక్ జట్టును ఆదుకున్నాడు. కేవలం యాభై ఒక్క బంతుల్లోనే పది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో వంద పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. అతడికి తోడుగా విల్ జాక్స్ ఇరవై ఎనిమిది పరుగులు చేశాడు. బ్రూక్ ఆడిన ఈ వీరోచిత ఇన్నింగ్స్.. ఇంగ్లాండ్ జట్టు ఆత్మవిశ్వాస పెంపునకు ఎంతో దోహదపడింది. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో సెంచరీ సాధించిన తొలి కెప్టెన్‌గా బ్రూక్ రికార్డులకెక్కాడు.

### ఉత్కంఠగా చివరి ఓవర్లు

చివరి ఓవర్లలో పాక్ బౌలర్లు వరుసగా వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పే ప్రయత్నం చేశారు. బ్రూక్ ఔట్ అయిన తర్వాత ఇంగ్లాండ్ కాస్త తడబడింది. కానీ పంతొమ్మిదో ఓవర్ ముగిసేసరికి మ్యాచ్ ఉత్కంఠగా మారింది. ఆఖరి ఓవర్ మొదటి బంతికే ఆర్చర్ ఫోర్ కొట్టి లాంఛనం పూర్తి చేశాడు. ఈ విజయంతో ఇంగ్లాండ్ దర్జాగా సెమీస్‌కు చేరగా, పాకిస్తాన్ సెమీస్ ఆశలు సంక్లిష్టంగా మారాయి. తదుపరి మ్యాచ్‌లో శ్రీలంకపై తప్పక నెగ్గాల్సిన పరిస్థితుల్లోకి పాక్ నెట్టబడింది. ఇక ఇతర జట్ల (ముఖ్యంగా న్యూజిలాండ్) గెలుపోటములపై పాకిస్తాన్ భవితవ్యం ఆధారపడి ఉంది.



# బ్రిస్బేన్‌లో ఆసీస్ జయభేరి

## తొలి వన్డేలో తడబడ్డ భారత మహిళలు!

- ఆరు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘనవిజయం
- 214 పరుగులకే కుప్పకూలిన టీమిండియా ఇన్నింగ్స్
- అర్ధ శతకాలతో ఆకట్టుకున్న మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్
- బంతితో మెరిసిన శ్రీ చరణి.. వన్డే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఆసీస్

**బ్రిస్బేన్:** మహిళల టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుని భీకర ఫామ్‌లో కనిపించిన భారత మహిళల జట్టు, వన్డే సిరీస్‌ను మాత్రం ఓటమితో ప్రారంభించింది. మంగళవారం (ఫిబ్రవరి 24) బ్రిస్బేన్‌లోని అలన్ బార్డర్ ఫీల్డ్ మైదానంలో జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. ఆలౌరౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆసీస్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

### తడబడ్డ టాప్ ఆర్డర్.. మోసిన మిడిలార్డర్

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ప్రతిక రావెల్ (0) డకౌట్‌గా వెనుతిరగ్గా, కాసేపటికే షఫాలీ వర్మ (4), జెమీమా రోడ్రిగెజ్ (8) కూడా పెవిలియన్ చేరారు. కేవలం 52 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (58), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (53) బాధ్యతాయుతంగా ఆడి ఆదుకున్నారు. ఇద్దరూ అర్ధ శతకాలు సాధించి స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. చివర్లో యువ ఆల్ రౌండర్ కాష్వీ గౌతమ్ (44 బంతుల్లో 43) మూడు సిక్సర్లతో చెలరేగడంతో టీమిండియా గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఆసీస్ బౌలర్ల ధాటికి భారత్ 48.3 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌట్ అయింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆష్లే గార్డనర్ మూడు వికెట్లు తీయగా, మేగన్ షట్ రెండు వికెట్లు పడగొట్టింది. బ్యాటింగ్ చేస్తూ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మోకాలికి గాయం కావడం జట్టును కాస్త కలవరపెట్టింది.

### అలవోకగా ఛేదించిన ఆస్ట్రేలియా..

215 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు కెప్టెన్ అలిస్సా హీలీ (50), ఫోబ్ లిచ్ ఫీల్డ్ (32) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించిన తర్వాత, భారత బౌలర్ శ్రీ చరణి వరుస బంతుల్లో లిచ్ ఫీల్డ్, జార్జియా వోల్ (0) వికెట్లు తీసి ఆసీస్‌ను కాస్త ఇబ్బంది పెట్టింది. అయితే ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్టార్ బ్యాటర్ బెత్ మూనీ (76) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో అదరగొట్టింది. ఆమెకు తోడుగా అన్నాబెల్ సదర్లాండ్ (48 నాటౌట్) రాణించడంతో ఆసీస్ కేవలం 38.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 217 పరుగులు చేసి సునాయాసంగా గెలుపొందింది. బౌలింగ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన మిగతా భారత బౌలర్లు.. ఆస్ట్రేలియా బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన బెత్ మూనీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య రెండో వన్డే ఫిబ్రవరి 27న హోబార్ట్ వేదికగా జరగనుంది.

# మహిళల టీ-20 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల!

## జూన్ 12 నుంచి జులై 5 వరకు ఇంగ్లండ్ వేదికగా సమరం

## తొలిసారిగా బరిలో పన్నెండు జట్లు.. పసికూన నెదర్లాండ్స్ ఎంట్రీ

## జూన్ 14న దాయాది పాకిస్థాన్‌తో భారత్ తొలి పోరు

## జులై 5న చారిత్రక లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్

**అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐసీసీ మహిళల టీ-20 వరల్డ్ కప్-2026 షెడ్యూల్ వచ్చేసింది. ఆతిథ్య దేశమైన ఇంగ్లండ్ వేదికగా జూన్ 12 నుంచి జులై 5 వరకు ఈ మెగా టోర్నీ జరగనుంది. ఈ మేరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటించింది. గత టోర్నీలకు భిన్నంగా ఈసారి పన్నెండు జట్లు ట్రోఫీ కోసం పోటీ పడబోతున్నాయి.**

### గ్రూపుల విభజన ఇలా..

మొత్తం పన్నెండు జట్లను ఐసీసీ రెండు గ్రూపులుగా విభజించింది. గ్రూప్-ఏలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో పాటు భారత్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు చోటు దక్కించుకున్నాయి. ఈ మెగా టోర్నీలో ఆడడం నెదర్లాండ్స్‌కు ఇదే తొలిసారి. ఇక గ్రూప్-బీలో ఆతిథ్య ఇంగ్లండ్ తో పాటు వెస్టిండీస్, న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లు తలపడనున్నాయి.

### సమరం మొదలయ్యేది అక్కడే..

జూన్ 12న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే తొలి మ్యాచ్ లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు శ్రీలంకతో తలపడనుంది. ఈ టోర్నీ కోసం ఇంగ్లండ్ లోని ఏడు ప్రతిష్టాత్మక మైదానాలను ఐసీసీ ఎంపిక చేసింది. ఎడ్జ్‌బాస్టన్, ఓల్డ్ ట్రాఫోర్డ్, హాంప్‌షైర్ బౌల్, హెడింగ్లే, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్, ది ఓవల్, లార్డ్స్ మైదానాల్లో ఈ మ్యాచ్ లు జరగనున్నాయి.

### దాయాదితోనే టీమిండియా తొలి వేట..

భారత జట్టు తన తొలి మ్యాచ్ ను దాయాది పాకిస్థాన్ తో ఆడనుంది. జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత జూన్ 17న నెదర్లాండ్స్ తో, జూన్ 21న దక్షిణాఫ్రికాతో, జూన్ 25న బంగ్లాదేశ్ తో లీగ్ దశ మ్యాచ్ లు ఆడుతుంది. జూన్ 28న పటిష్టమైన ఆస్ట్రేలియాతో లార్డ్స్ వేదికగా భారత్ తన ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడుతుంది.

### సెమీస్, ఫైనల్ ఎక్కడంటే..

జూన్ 28తో లీగ్ దశ మ్యాచ్ లు ముగుస్తాయి. రెండు గ్రూపుల నుంచి పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన నాలుగు జట్లు సెమీ ఫైనల్ కు చేరుకుంటాయి. జూన్ 30న లండన్ లోని ‘ది ఓవల్‘ మైదానంలో తొలి సెమీ ఫైనల్ జరుగుతుంది. జులై 2న అదే మైదానంలో రెండో సెమీ ఫైనల్ జరగనుంది. ఇక క్రికెట్ పుట్టినిల్లుగా భావించే ‘లార్డ్స్‘ మైదానంలో జులై 5న విశ్వవిజేతను తేల్చే ఫైనల్ పోరు జరుగుతుంది.

### భారత మ్యాచ్ ల పూర్తి షెడ్యూల్

- జూన్ 14: భారత్ వర్సెస్ పాకిస్థాన్ (ఎడ్జ్‌బాస్టన్)
- జూన్ 17: భారత్ వర్సెస్ నెదర్లాండ్స్ (హెడింగ్లే)
- జూన్ 21: భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా (ఓల్డ్ ట్రాఫోర్డ్)
- జూన్ 25: భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ (ఓల్డ్ ట్రాఫోర్డ్)
- జూన్ 28: భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా (లార్డ్స్)







# కేరళ స్టోరీ మూవీపై హైకోర్టు విచారణ

## ముందుగా కోర్టులో చిత్ర ప్రదర్శనకు ఆదేశం

'ది కేరళ స్టోరీ 2' విడుదలకు ముందు కోర్టులో ప్రదర్శించాలని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ సినిమాలో కేరళను తప్పుగా చూపించారని ఆరోపణలు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయనే రాష్ట్ర ప్రజల ఆందోళనలను విస్మరించలేమని కోర్టు పేర్కొంది.ఈ సినిమా సెన్సార్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం కేరళ హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టులు సాధారణంగా సినిమాలకు సంబంధించి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ విషయంలో జోక్యం చేసుకోదు. కానీ.. ఈ సినిమా టైటిల్‌లో కేరళ రాష్ట్రం పేరు ఉపయోగించారని ఈ నేపథ్యంలో దీనిపై విచారణకు అంగీకరించినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 25న 'ది కేరళ స్టోరీ 2'ను కోర్టులో ప్రదర్శించాలని ఆ తర్వాతే దీని సెన్సార్ విషయంలో నిర్ణయం తీసుకోగలమని తెలిపింది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఇటీవల 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందింది 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'. టీజర్, ట్రైలర్లు విడుదలయ్యాక ఈ మూవీ కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిపై తాజాగా.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిపై స్పందించారు. ఈ సినిమాపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. దీన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27న ఈ చిత్రం విడుదల కానుంది.



# ఏడవని రాత్రి లేదు

**టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన నటనతో, అందంతో మంత్రముగ్ధులను చేస్తున్న నటి మృణాల్ ఠాకూర్. బయటకు ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపించే ఈ 'సీతమ్మ'.. కెరీర్ ప్రారంభంలో, వ్యక్తిగత జీవితంలో బాడీ షేమింగ్ వల్ల తీవ్రమైన మానసిక వేదనను అనుభవించానని వెల్లడించింది. శరీర బరువు కారణంగా నెటిజన్లే కాకుండా, తన చుట్టూ ఉన్నవారు కూడా తనను ఎగతాళి చేసేవారని, ఆ సమయంలో తాను ఎదుర్కొన్న ఒత్తిడి గురించి మృణాల్ తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మనసు విప్పింది.**

మృణాల్ మాట్లాడుతూ.. 'శరీర బరువు వల్ల వచ్చిన ట్రోల్స్ చూసి ఏడుస్తూ నిద్రపోయి.. ఉబ్బిన కళ్లతో నిద్రలేచిన రోజులు ఎన్నో ఉన్నాయి. ఆ మాటలు నా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయి. కానీ, ఒకరోజు జిమ్‌లో ఒక సన్నటి అమ్మాయి నా దగ్గరకు వచ్చి 'నేను మీలాగా మారాలంటే ఏం చేయాలి?' అని అడగింది.. అప్పుడు నాకు అర్థమైంది.. మనం ఎలా ఉన్నా మనల్ని ఇష్టపడేవారు ఉంటారని. మనల్ని మనం గౌరవించుకోవడం మొదలుపెడితేనే ఇతరులు మనకు విలువ ఇస్తారని తెలుసుకున్నాను. వేల మంది ట్రోల్స్ చేసినా వాటిని పట్టించుకోకుండా నీ పని నువ్వు చేసుకుంటూ సాగిపోవాలని అక్షయ్ సర్ చెప్పారు. ఏదైనా సినిమా పాత్ర కోసం సన్నబడాల్సి వస్తే అది వృత్తిలో భాగం కాబట్టి కచ్చితంగా మారాలని ఆయన సూచించారు. అప్పటి నుంచి నేను ఆ మాటలనే ఫాలో అవుతున్నాను' అని మృణాల్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం మృణాల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాడీ షేమింగ్ ఎదుర్కొనే వారికి మృణాల్ మాటలు ఒక పెద్ద సపోర్ట్ లా కనిపిస్తున్నాయి.




# వారణాసి కోసం జార్జియాకు మహేశ్ బాబు

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫాంటసీ మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. కథను కె.వి. విజయేంద్ర ప్రసాద్, ఎస్.ఎస్. కాంచి అందిస్తుండగా, మాటలను దేవ కట్టా రచిస్తున్నారు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి సమకూరుస్తున్నారు. సినిమాలో మహేశ్ బాబు ద్విపాత్రాభినయం చేయనున్నారని సమాచారం. 'రుద్ర'గా శక్తివంతమైన యోధుడిగా, అలాగే పౌరాణిక ఎపిసోడ్‌లో 'రాముడు'గా దర్శనమివ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా 'మందాకినీ' పాత్రలో నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాత్రల పరిచయంతోనే సినిమాపై అంచనాలు గరిష్ట స్థాయికి చేరాయి. హైదరాబాద్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసిన యూనిట్, తదుపరి షెడ్యూల్ కోసం జార్జియాకు వెళు తున్నారు . ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే అడ్వెంచర్ ఎపిసోడ్‌లను విదేశీ లొకేషన్లలో తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. అయితే జార్జియాకి వెళుతున్న మహేష్ బాబుకి భార్య నమ్రత, కూతురు సితార సెండాఫ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఇదిలా ఉంటే గ్రాండ్ యాక్షన్ బ్లాక్స్, భారీ సెట్స్ ఈ షెడ్యూల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని రాజమౌళి వెల్లడించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇది పూర్తిస్థాయి సైన్స్ ఫిక్షన్ సినిమా కాదని, ఫాంటసీ మైథలాజికల్ జానర్‌కే చెందినదని రాజమౌళి తెలిపారు. పురాణాల నేపథ్యాన్ని ఆధునిక యాక్షన్ అడ్వెంచర్ శైలిలో మేళవిస్తూ భిన్న కాలప్రవాహాలను కలిపే కథగా 'వారణాసి' రూపుదిద్దుకుంటోందని చెప్పారు. 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా మూవీ విడుదల కానుంది.



# కల్కి-2 షూటింగ్‌లో బచ్చన్, కమల్



పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 -2' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో 'కల్కి 2' షూటింగ్ మొదలైనట్లు తెలుస్తుంది. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) మధ్య కీలక సన్నివేశాలను దర్శకుడు నాగ అశ్విన్ చిత్రీకరిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 ఎ‌డి' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో 'కల్కి 2' షూటింగ్ మొదలైనట్లు తెలుస్తుండగా.. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) మధ్య కీలక సన్నివేశాలను దర్శకుడు నాగ అశ్విన్ చిత్రీకరిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్ ద్వారా ఈ ఫోటోలను షేర్ చేస్తూ.. 'దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్ళీ కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిస్తోంది. చివరిసారిగా మేమిద్దరం 1985లో 'గిరఫ్తార్' సినిమాలో కలిసి నటించాం' అని రాసుకొచ్చారు. ఇక అమితాబ్ షేర్ చేసిన ఫోటోలలో ఇద్దరు స్టార్స్ ఆత్మీయంగా కౌగిలించుకోవడం, సరదాగా ముచ్చటించుకోవడం కనిపిస్తోంది. ఇందులో బిగ్ బీ తన అశ్వత్థామ గెటప్‌లో కనిపించబోతున్నాడు.

# జోరు మీదున్న కిరణ్ అబ్బవరం



టాలీవుడ్‌లో సక్సెస్ ఒక్కటి పడితే హీరోల మార్కెట్ విలువ ఎలా పెరుగుతుందో మ-రోసారి చర్చకు దారితీసింది. యువ హీరో కిరణ్ అబ్బవరం. వరుసగా మంచి విజయాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఫుల్ క్రేజ్‌ను ఆస్వాదిస్తున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల వచ్చిన 'క', 'కె ర్యాంప్' సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు సాధించడంతో కిరణ్ అబ్బవరం మార్కెట్ గణనీయంగా పెరిగిందని సమాచారం. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే కథలు, అందులో కామెడీ ఎమోషన్ సెంటిమెంట్ మేళవింపుతో ఆయన ఎంచుకునే స్క్రిప్ట్స్ నిర్మాతలకు నమ్మకం కలిగిస్తున్నాయంటున్నారు. కిరణ్‌తో సినిమా చేస్తే మినిమమ్ గ్యారెంటీ' అన్న భావన కొందరు నిర్మాతల్లో ఏర్పడిందని ఇండస్ట్రీ టాక్. దీంతో ఆయనకు భారీ ఆఫర్లు వస్తున్నాయని ప్రచారం. తాజా సమాచారం ప్రకారం, కిరణ్ అబ్బవరం ప్రస్తుతం ఒక్కో సినిమాకు దాదాపు రూ. 12 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటున్నారట. ఇటీవల ఓ ప్రముఖ నిర్మాణ సంస్థతో కుదిరిన ఒప్పందంలో కూడా ఇదే స్థాయిలో పారితోషికం తీసుకున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. 'కె ర్యాంప్' తర్వాత కిరణ్ అబ్బవరం మరో రిఫ్రెషింగ్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ప్రస్తుతం ఆయన 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో 'మ్యాడ్' ఫేమ్ శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటిస్తున్నారు.ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తుండగా, సంగీతాన్ని మణిశర్మ అందిస్తున్నారు. కథను 'బేబీ' ఫేమ్ సాయి రాజేష్ అందిస్తున్నారు. నిర్మాత ఃూఐఔతో కలిసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతోంది. చెన్నై నేపథ్యంగా సాగే ఈ లవ్ స్టోరీలో ఫస్ట్ లవ్, రిలేషన్‌షిప్స్‌లోని కొత్త కోణాన్ని చూపించనున్నట్లు విడుదలైన గ్లింప్స్ సూచిస్తోంది. యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం, సరైన కథల ఎంపికతో ముందుకెళ్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రెమ్యునరేషన్ పెంపుపై వస్తున్న వార్తలు నిజమైతే, ఇది ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా మారే అవకాశం ఉంది.మొత్తానికి, వరుస విజయాల జోరుతో కిరణ్ అబ్బవరం టాలీవుడ్‌లో తన మార్కెట్ విలువను మరింత స్ట్రాంగ్ చేసుకుంటున్నాడని చెప్పవచ్చు

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**